నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
శుక్రవారం | ఆగస్టు 09, 2024 | www.navatelangana.com

పారిశుధ్య లోపం లేకుండా చూడాలి

బోథ్ : గ్రామాలలో పారిశుధ్య లోపం లేకుండా చూడాలని జడ్పీ సీఈవో కాలిందిని అన్నారు. మండలంలోని కుచులాపూర్ గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వానాకాలం ఇంటిచుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అనంతరం వెంకటేశ్వర ఆలయంలో మొక్కలు నాటారు. గురుకుల పాఠశాలలో వంట గది గార్డెన్, వర్మీకంపోస్టును పరిశీలించారు. ఆర్గానిక్ వెజిటేబుల్ ఉపయోగాలు, మెడిసిన్ ప్లాంటు మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మాధవి, ఎంపీడీఓ జీవన్‌రెడ్డి, ఏపీఓ జగ్దేరావు, డిసియస్ఓ కిరణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ కళ్యాణ్ చక్రవర్తి, పంచాయతీ కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.



వాటర్ ట్యాంకుల నిర్మాణానికి భూమిపూజ

ఖానాపూర్ : పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో గురువారం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద అమృత్ స్కీం-2 కింద మంజూరైన వాటర్ ట్యాంక్‌లు, పైప్‌లైన్ నిర్మాణానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమృత్ స్కీమ్-2 కింద రూ.22.50కోట్లతో రెండు వాటర్ ట్యాంకులు మంజూరయ్యాయన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద ప్రజలు నీరు లేక ఇబ్బందులకు గురవుతున్నారని, సమస్యను దృష్టిలో ఉంచుకొని త్వరలో వాటర్ ట్యాంక్‌ల నిర్మాణాన్ని పూర్తి చేసి కాలనీవాసులకు నీరు అందిస్తామని పేర్కొన్నారు. పట్టణంలో కూడా ఒక వాటర్ ట్యాంకును నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజూర సత్యం, వైస్ చైర్మన్ కావలి సంతోష్, నాయకులు పరిమి సురేష్, అమానుల్లాఖాన్, షబ్బీర్ పాషా, మున్సిపల్ కమిషనర్ మనోహర్, ఈఈ గంగాధర్, డీఈ సంతోష్ జాదవ్, మండల అధ్యక్షులు దయానంద్ పాల్గొన్నారు.



గుండెపోటుతో ఉపాధ్యాయురాలు మృతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



గుండెపోటుతో దివ్యాంగ ఉపాధ్యాయురాలు మృతి చెందిన ఘటన జిల్లాలో చోటుచేసుకుంది. పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన మైలవార్ మమత(29) గాదిగూడ మండలంలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్నారు. మంగళవారం ఇంట్లో ఉన్న సమయంలో ఛాతీలో నొప్పి వస్తుందని చెప్పడంతో కుటుంబీకులు వెంటనే రిమ్స్‌కు తరలించారు. మమతను పరీక్షించిన వైద్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించగా ఆ రోజు రాత్రి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. బుధవారం చికిత్స పొందుతున్న క్రమంలో సాయంత్రం వేళ మమత మృతి చెందింది. దీంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గురువారం అంత్యక్రియలు పూర్తి చేశారు. మృతురాలికి 5నెలల బాబు ఉన్నాడు. తల్లి మరణించడంతో పాల వయస్సులో ఉన్న బాబు పరిస్థితి కాలనీవాసులను కలిచి వేసింది.

రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

సమగ్ర శిక్షణలో పని చేస్తున్న వారిలో మరొక గుండె ఆగిపోయిందని, ఇప్పటివరకు గుండెపోటుతో 163 మంది మరణించారని తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ మాధవ్ పేర్కొన్నారు. 5 నెలల బాబుకు తల్లి దూరమైందని తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమెకు సంఘం తరపున సంతాపం ప్రకటించారు. తోటి ఉద్యోగికి తోచిన న్యాయం చేయాలని కోరారు. సమగ్ర శిక్షణలో ఎన్నో ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మమత కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు.

పశుమిత్రల సమస్యలు పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ-నస్పూర్

పశుమిత్ర వర్కర్స్ యూనియన్(సీఐటీయు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా పశువైద్యశాఖధికారి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పశుమిత్ర వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగమణి మాట్లాడుతూ పాడి పరిశ్రమ బాగోగులు చూసే పశుమిత్రల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందన్నారు. పశుమిత్రలను వర్కర్లుగా గుర్తించాలని, కనీస వేతనం చెల్లించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. యూనిఫాం, బ్లౌజులు, మాస్కులు, మందులతో కూడిన కిట్ ఇవ్వాలని, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, పని భద్రత, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, స్వప్న, శారద, సరోజ, స్వరూప, రజిత పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 28 మంది లబ్దిదారులకు రూ.7,58,000 విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ఆసుపత్రిలో చేసిన ఖర్చుల రశీదులు అందిస్తే వారందరికీ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, నాయకులు రఫీ, ఎలుక రాజు, ప్రవీణ్, శ్రీధర్‌రెడ్డి, తాహెర్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం



నవతెలంగాణ-నస్పూర్

ఆర్కె-7 గని మేనేజర్‌గా సేవలందించి ఆర్కె 5,6 గ్రూప్ ఏజెంట్‌గా ప్రమోషన్‌పై వెళ్తున్న డీజీఎం ఎస్.శ్రీధర్‌ను ఐఎన్టీయూసీ ఏరియా వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు గరిగ స్వామి, తిరుపతి రాజు, లాగల శ్రీనివాస్, ఏరియా నాయకులు భూపతి అశోక్, గని పిట్ సెక్రటరీ శ్రీకాంత్, నాయకులు ప్రేమ్‌కుమార్, ప్రణయ్, సత్యనారాయణ, వంశీ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాల, తెలంగాణ మోడల్ స్కూల్‌లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. మురికి కాలువలలో బయోలార్వా స్ప్రే చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మల్లేష్, పంచాయతీ కార్యదర్శి మేఘన, ఎంఎల్‌హెచ్‌పీ హరీష్, ప్రిన్సిపాల్ అందే నాగ మల్లయ్య, ఉపాధ్యాయులు పుష్పలత, ఏఎన్ఎం సునీత, ఆశా వర్కర్ ముత్యాల వెంకటరమణ, కాంగ్రెస్ నాయకులు మంద వెంకటేష్, బాకీ నరేష్, అంగన్వాడీ టీచర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాలు మారినా ఆదివాసుల బతుకులు మారడం లేదు

- టీఏజీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తొడసం భీంరావు



నవతెలంగాణ-మంచిర్యాల

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసుల చట్టాలను, హక్కులను కాలరాస్తున్నాయని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తొడసం భీంరావు అన్నారు. ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని చార్వాక ట్రస్ట్ హాల్‌లో గురువారం ఆదివాసుల గోడు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. దీనికి భీంరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఆదివాసుల బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2022లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అటవీ సంరక్షణ చట్టాన్ని తీసుకొచ్చి ఆదివాసులకు అడవి మీద హక్కులు లేకుండా చేసిందన్నారు. అడవి సంరక్షకులైన ఆదివాసులను అడవుల నుండి వెళ్లగొట్టి అడవులన్నింటినీ కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. ఈ చట్టం అమలుతో ఆదివాసుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. 40శాతం ఉన్న ఆదివాసీ గ్రామాలను ఏజెన్సీ గ్రామాలుగా గుర్తించి వారి అభివృద్ధికి నిధులు కేటాయించాలని చట్టం ఉన్నప్పటికీ ఈ జిల్లాలో అలాంటి గ్రామాలను గుర్తించకపోవడం శోచనీయమన్నారు. పోడు భూములను సాగు చేసుకుంటున్న వారిపై అటవీ శాఖ అధికారులు జులుం ప్రదర్శిస్తూ వేసిన పంటలను ధ్వంసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసీ చట్టాల అమలు, సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రభుత్వాలు పనిచేయాలని, లేనియెడల భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయాల్సి వస్తుందని స్పష్టం చేశారు. సమావేశంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాల రాజన్న, ఎర్మ పున్నం, సామాజిక న్యాయవేదిక నాయకులు రంగు రాజేశం, ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షులు ఉండ్రాల ఎల్లయ్య, టీఏజీఎస్ నాయకులు ఆత్రం శ్రావణ్, సిడాం సమ్మక్క, మర్మల మల్లేశ్వరి, బూదక్క, తలండి ముత్తయ్య, మాధవి, భీమేష్, పద్మ, ఆత్రం రాజు వివిధ గ్రామాల ఆదివాసులు పాల్గొన్నారు.

మహిళలను ప్రగతిబాటలో పయనింపజేయాలనేదే లక్ష్యం

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళలను ఆర్థికంగా ప్రగతిబాటలో పయనింపజేయాలనే సంకల్పంతో ప్రభుత్వం మహిళా శక్తి కార్యక్రమాన్ని చేపట్టిందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం మహిళ వికాస జిల్లా సమాఖ్య కార్యవర్గ సమావేశం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయంలో సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా 217 కొత్త సంఘాల్లో 5,570 మంది మహిళలను చేర్పించడం, బ్యాంకు లింకేజ్ ద్వారా 4,965 మహిళ సంఘాలకు 105.57 కోట్ల రూపాయలను జులై నెల వరకు లక్ష్యం నిర్దేశించడం జరిగిందని తెలిపారు. 18 మండల సమాఖ్యల్లో ఏకరూప దుస్తుల కటింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా పరిషత్ పాఠశాలలో 56,932 పిల్లలకు ఏక రూప దుస్తులను, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో 28246 ఏక రూప దుస్తులు అందించడం, అంగన్వాడీ పాఠశాల పిల్లలకు అందించాల్సిన దుస్తులు 4171, ఎంటర్ ప్రైజెస్ మొత్తం టార్గెట్ 3929, ఇందిర మహిళా శక్తి క్యాంటీన్లు 4 లక్ష్యమని తెలిపారు. 18 స్టీల్ బ్యాంకుల ఏర్పాటు లక్ష్యమన్నారు. స్త్రీ నిధి కింద 12.00 కోట్లు రుణాలు లక్ష్యం జులై నెల వరకు లక్ష్యం నిర్దేశించడం జరిగినదని తెలిపారు. జిల్లా పరిషత్ పాఠశాలలో ఏక రూప దుస్తులను 54,926 అందించడం జరిగిందని పేర్కొన్నారు. 3 మండల సమాఖ్యల్లో ఏక రూప దుస్తుల కటింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో 28246, అంగన్వాడి పాఠశాల పిల్లలకు 4171 ఏకరూప దుస్తులు అందించడం జరిగిందని పేర్కొన్నారు. మహిళా సంఘాల ద్వారా ఆదాయం పెంపొందించే దిశగా శిల్పా రామంలో, గాంధీ పార్కులో స్టాల్స్ ఏర్పాటు చేసి ఉపాధి పొందాలని అన్నారు. ప్రతి మూడవ శనివారం తల్లిదండ్రులతో సమావేశాలతో పాటు ఈ కార్యక్రమం నిర్వహించాలని కోరారు. సమైఖ్య భవనాల నిర్మాణాలకు స్థలాన్ని సేకరించాలని, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. అనంతరం జూట్ బ్యాగులను ప్రారంభించి మహిళా సమైఖ్య సంఘాలతో భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ సాయన్న, మహిళా సంఘాల అధ్యక్షులు, డీపీఎం, ఏపీఎం పాల్గొన్నారు.

చోరీ కేసును ఐదు రోజుల్లో ఛేదించిన పోలీసులు



నవతెలంగాణ-సారంగాపూర్

బీరవెల్లిలో పట్టపగలే జరిగిన చోరీని పోలీసులు ఐదు రోజుల్లో ఛేదించారు. గురువారం డీఎస్పీ గంగారెడ్డి వివరాలు వెల్లడించారు. బీరవెల్లి గ్రామానికి చెందిన ఒన్నే సుధాకర్ ఇంట్లో ఈ నెల 2న దొంగతనం జరిగింది. సుధాకర్ గొర్రెలు మేపడానికి వెళ్లగా భార్య లక్ష్మి వ్యవసాయ పనులకు వెళ్లింది. ఈ సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి బీరువాలోని దాదాపు 7తులాల బంగారు నగలు, రూ.1.50లక్షల నగదు దొంగతనం చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని నిర్మల్ రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రామకృష్ణ దర్యాప్తు చేసి నిందితుడిని పట్టుకున్నారు. నిందితుడు ఇప్ప పరమేశ్వర్ స్వస్థలం బోథ్ మండలంలోని సాయినగర్ కాలనీ. గతంలో ఆదిలాబాద్‌లో చోరీలు చేసి జైలుకెళ్లి వచ్చాడు. కొంత కాలంగా బీరవెల్లిలో తల్లి దగ్గర ఉంటూ కూలి పనులు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో కుటుంబ పోషణతో పాటు తన జల్సాల కోసం డబ్బులు సరిపోక దొంగతనానికి పాల్పడ్డాడు. కూలి పని చేస్తున్న ఇంటి వెనుకల గల ఇంటి యజమాని ఒన్నే సుధాకర్ కుటుంబ సభ్యులు ఉదయం వెళ్లి సాయంత్రం రావడం గమనించాడు. అతని ఇంట్లో దొంగతనానికి పథకం వేశాడు. ఈ నెల 2న మధ్యాహ్నం రాయితో ఇంటి తాళం పగులగొట్టి బీరువాపై తాళం చెవి దొరకడంతో తెరిచి అందులో దాదాపు 7తులాల బంగారు నగలు, రూ.1.50లక్షల నగదు దొంగతనం చేసి ఆదిలాబాద్‌కు పారిపోయాడు. గురువారం ఆదిలాబాద్ నుండి తిరిగొచ్చి బీరవెల్లి బస్టాండ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు పట్టుకొని అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుండి బంగారు, వెండి నగలు స్వాధీనం చేసుకున్నారు. దొంగను పట్టుకోవడంలో డీఎస్పీ గంగారెడ్డి ఆధ్వర్యంలో చాకచక్యంగా వ్యవహరించిన నిర్మల్ రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రామకృష్ణ, ఎస్సై శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌వర్మ, రాజుగౌడ్, వినోద్, మనోజ్‌ను ఎస్పీ జానకి షర్మిల అభినందించారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి

- మంచిర్యాల డీసీపీ భాస్కర్



నవతెలంగాణ-మంచిర్యాల

ప్రతి విద్యార్థి దశలో ఇంటర్మీడియేట్ అనేది అత్యుత్తమమైనదని, జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవడానికి ఇది దోహద పడుతుందని డీసీపీ ఏ.భాస్కర్ అన్నారు. గురువారం పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన అల్ఫోర్స్ ఇంటర్మీడియెట్ కళాశాల స్వాగతోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు కొత్తగా ఆలోచించి నూతన ఆవిష్కరణల వైపు దృష్టి సారించాలన్నారు. సమాజంలో ప్రత్యేక పాత్ర పోషించాలని తెలిపారు. ఇప్పుడున్న సమాజంలో యువత పెడదోవ పడుతోందని, డ్రగ్స్, మద్యం లాంటి మత్తు పదార్థాలకు బానిసలై జీవితాల్ని నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఎంత జాగ్రత్తగా చదివితే అంత ఉన్నత స్థాయికి ఎదుగుతామని, విద్యార్థులెవరూ మత్తు, డ్రగ్స్ జోలికి పోకుండా మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని సూచించారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యంతో ఉండాలని, అప్పుడే జీవితంలో గొప్ప స్థాయికి ఎదుగుతామని తెలిపారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్, రాంప్రసాద్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.



5 స్టార్ రేటింగ్ అవార్డు అందుకున్న ఓరియంట్ సిమెంట్ కంపెనీ



నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ 5 స్టార్ అవార్డును సొంతం చేసుకుంది. ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్(ఐబీఎం), మినిస్ట్రీ ఆఫ్ మైన్స్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి 2022-23 సంవత్సరానికి అత్యుత్తమ పనితీరు కనబరిచిన గనులకు 5 స్టార్ రేటింగ్ అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమ సందర్భంగా దేశంలో ఎత్తై 2022-23లో 5 స్టార్ రేటింగ్‌ను పొందిన 68 గనులను సత్కరించారు. దీంట్లో తెలంగాణ రాష్ట్రంలో 5 గనులు 5 స్టార్ రేటింగ్ సాధించాయి. గనులు తవ్వి ఖనిజాన్ని వెలికి తీసే సమయంలో పర్యావరణాన్ని కాపాడుకుంటూ సుస్థిర అభివృద్ధి నిబంధనలకు అనుగుణంగా గనుల తవ్వకాలు చేపడుతున్న 68 గనులకు 5 స్టార్ రేటింగ్ అవార్డులు ప్రదానం చేశారు. దీంట్లో భాగంగా దేవాపూర్ సున్నపు రాయి గని కూడా భాగస్వామ్యం వహించి వరుసగా 2 సంవత్సరాలు 5 స్టార్ రేటింగ్ సాధించింది. ఈ మేరకు బుధవారం తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ డిప్యూటీ జీఎం ఎస్.ఎల్లయ్య, దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ ఎన్వీ సహారే సంయుక్తంగా న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును కేంద్ర గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.

క్రీడలతో ఒత్తిడి నుండి ఉపశమనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అనునిత్యం కేసుల పరిష్కారం, వాదనలు తదితర సమస్యలతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్న న్యాయమూర్తులు, న్యాయవాదులకు క్రీడలతో ఒత్తిడి నుంచి ఉపశమనం పొందగలుగుతారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. గురువారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సహచర న్యాయమూర్తులతో కలిసి క్యారమ్స్ ఆటను ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ న్యాయవాదులు, న్యాయమూర్తులు ప్రతిరోజూ కనీసం గంటపాటు క్రీడల్లో పాల్గొంటే మానసి ఉల్లాసాన్ని పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు శివరామ్ ప్రసాద్, ప్రమీలా జైన్, దుర్గారాణి, డిఎల్ఎస్ఎ కార్యదర్శి సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండ్రాల నగేష్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



నవతెలంగాణ-కుభీర్

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను హెచ్చరించారు. గురువారం మండలంలోని వీరేగాం గ్రామ పంచాయతీని సందర్శించారు. గ్రామ శ్మశాన వాటిక, నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్‌లను పరిశీలించారు. ప్రతిరోజు గ్రామంలో సానిటేషన్ పనులు జరుగుతున్నాయా? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామపంచాయతీని సందర్శించి రిజిష్టర్‌లపై ప్రత్యేక అధికారి సంతకాలు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహ వ్యక్తం చేశారు. గ్రామాలతో పాటు తండాలలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీలో పలు రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీవో మోహన్‌సింగ్, ఏపీవో హరిలాల్, పంచాయతీ కార్యదర్శి సూర్య, వివిధ గ్రామాల కార్యదర్శులు, ఉపాధిహామీ టెక్నికల్ అస్టెంట్ మహేష్, ఫీల్డ్ అస్టెంట్ శేషరావు ఉన్నారు.

తపాల జీవిత బీమా భవిష్యత్తుకు భరోసా



ఖానాపూర్ : తపాల శాఖ అందిస్తున్న జీవిత బీమా భవిష్యత్‌కు భరోసా నిస్తుందని, అందుకే ప్రజలు తపాల జీవిత బీమా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోస్టల్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సందీప్ అన్నారు. మండలంలోని సింగపూర్‌లో తపాల శాఖ పథకాల గురించి గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో తపాల శాఖ గ్రామ ప్రజల కోసం అందిస్తున్న చిన్న మొత్తాల పొదుపు పథకాలు చిన్న పెట్టుబడితో అధిక వడ్డీ అందిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల కోసం గ్రామీణ తపాల జీవిత బీమా పథకం, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రొఫెషనల్ డిగ్రీ ఉన్నవారు తపాలా జీవిత బీమా పథకం పొందవచ్చని తెలిపారు. తక్కువ ప్రీమియంతో అధిక బోనస్ పొందవచ్చని పేర్కొన్నారు. ఐపిపిబి ద్వారా జనరల్ ఇన్సూరెన్స్ సంవత్సరానికి రూ.520 ప్రీమియంతో పది లక్షల బీమా, రూ.755 ప్రీమియంతో 15లక్షల బీమా పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పచ్ రామకృష్ణ, ఐపిపిబి మేనేజర్ కల్యాణ్, సజన్‌సింగ్, టీపీఎం శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుతో జీవనాధారం కోల్పోతున్నాం

నవతెలంగాణ-నేరడిగొండ



మండలం కుప్టి గ్రామంలో హైడల్ ప్రాజెక్ట్ స్థలాన్ని పరిశీలించేందుకు గురువారం తహసీల్దార్ కలీమ్ వెళ్లారు. దీంతో గ్రామస్తులు హైడల్ ప్రాజెక్ట్ మాకు వద్దని వినతిపత్రం అందజేశారు. కుప్టి హైడల్ ప్రాజెక్టు నిర్మించడం వల్ల తమ జీవనాధారాన్ని కోల్పోతున్నామని, సంవత్సరానికి రెండు పంటలు పండించే వాళ్లమని ఈ ప్రాజెక్టు నిర్మించడం వల్ల జీవనాధారాన్ని కోల్పోతున్నామన్నారు. ఉండడానికి ఇండ్లు లేకుండా పోతున్నాయని పొలాలు ఇండ్లు కోల్పోవాల్సి వస్తుందన్నారు. కుప్టి ప్రాజెక్టు నిర్మించడానికి గ్రామస్తులు వ్యతిరేకంగా ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బొమ్మెన వెంకటరమణ, మెట్టు శ్రీధర్, చానా వెంకటరమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యాసంస్థలలో ర్యాగింగ్ పాల్పడిన వారిపై కఠిన చర్యలుంటాయని ఎస్పీ గౌష్ ఆలం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కళాశాలలో పాఠశాలలలో యాంటీ ర్యాగింగ్ కమిటీలను ఏర్పాటు చేసి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో, పాఠశాలలో నూతనంగా వచ్చిన విద్యార్థులపై ర్యాగింగ్ కు పాల్పడడం జరగడం చట్టరీత్యా నేరమని ఎటువంటి హాని చేయదలచుకున్న వారిపై ర్యాగింగ్ కు సంబంధించిన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తు కేసులు నమోదైతే ప్రభుత్వ ప్రైయివేట్ ఉద్యోగాలు రావని తెలిపారు. విద్యాసంస్థల్లో విద్యార్థులకు రాగింగ్‌పై అవగాహన, వాటి వల్ల కలిగే పరిణామాలపై చైతన్య పరచాలని ఆదేశించారు. ఎటువంటి అత్యవసర సమయంలోనైనా డయల్ 100కు ఫోన్ చేయాలని, తక్షణమే పోలీసు సిబ్బంది తమ వద్ద ఉంటుందన్నారు. రాగింగ్ పై అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీసుల తరపున అన్ని విద్యాసంస్థలలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

- కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. వనమహోత్సవం, స్వచ్ఛదనం పచ్చదనంలో భాగంగా గురువారం యాపల్‌గూడలోని 2వ బెటాలియన్ ఎస్పీ గౌస్ ఆలయం, డీఎస్‌ఓ ప్రశాంత్ బాజీరావ్ పాటిల్‌తో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. బెటాలియన్‌కు వచ్చిన కలెక్టర్‌కు కమాండెంట్ నితిక పంత్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ పర్యావరణం సముత్యంగా ఉండాలంటే వనాలుండాలన్నారు. ప్రభుత్వాలు కార్యక్రమాలు చేపడుతున్నా ప్రజాల భాగస్వామ్యం లేనిదే విజయవం కావన్నారు. చెట్లు లేని కారణంగా వాతావరణంలో సమూల మార్పులు వస్తున్నాయన్నారు. బెటాలియన్‌లో పండ్ల మొక్కలనే అధికంగా నాటడం జరిగిందన్నారు. ఇంకా స్థలం ఉందనీ అక్కడ నీరు నిల్వ కారణంగా నాటడం లేదన్నారు. భవిష్యత్తులో మరిన్నీ మొక్కలు నాటి పచ్చదనం పెంచేలా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా బెటాయలిన్ ఖాళీ స్థలంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం భవిష్యత్తు మరిన్నీ మొక్కలు నాటుతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సీఎంటీ దేవిదాస్ రాథోడ్, ఏజేపీ నారాయణ, అధికారులు పాల్గొన్నారు.

బురదలో నడవలేక అవస్థలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ పట్టణంలోని బంగారిగూడ కాలనీలో రోడ్లు లేకపోవడంతో కాలనీ వాసులు వర్ష కాలంలో ఇబ్బందులు పడుతున్నారు. కురుస్తున్న వర్షాలకు నీరు రోడ్లపైకి చేరడంతో రోడ్లన్నీ బురదగా మారాయి. దీంతో వాటిపై నడవలేక అవస్థలు పడుతున్నారు. కాలనీలో సరైన రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగు నీరు రోడ్లపైనే పారుతున్నాయి. కాలనీ అభివృద్ధికి స్పెషల్ గ్రాంట్లో డ్రైనేజీలకు రూ.రెండు కోట్ల పది లక్షలు మంజూరు చేసిన పనులు ప్రారంభం కాలేదు. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లు, మురుగు కాలువలు నిర్మించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

ప్రతి ఒక్కరు చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండలంలోని దంతనపల్లి గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా అధికారులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే మనిషి సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున పాడుబడిన కూలర్, టైర్లు, కొబ్బరి చిప్పలు, నీరు నిల్వ ఉంచకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను నాటి వాటిని సంరక్షించాలన్నారు. స్వేచ్ఛమైన గాలి చెట్ల వల్లే వస్తుందని, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులున్నారు.

ప్రతిరోజు విద్యార్థులను కళాశాలకు పంపాలి

నవతెలంగాణ-నేరడిగొండ



విద్యార్థులను ప్రతి రోజు కళాశాలకు పంపించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు తల్లిదండ్రులకు సూచించారు. గురువారం మండలం కిష్టాపూర్ గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు సుభాష్ మాట్లాడుతూ పిల్లలను ప్రతి రోజు కళాశాలకు పంపి, హాజరు శాతం పెంచుకునేల సహకారం అందించాలన్నారు. కళాశాలకు రావాలని గ్రామంలో ప్రతి విద్యార్థి ఇంటింటికెళ్లి విద్యార్థుల ప్రాముఖ్యతను తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు కుంబాజీ, ఉపేందర్ రెడ్డి, ప్రవీణ్, గ్రామస్తులు కరణ్ సింగ్, కిసాన్ సింగ్, ప్రతాప్ పాల్గొన్నారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్
- సమస్యలు పరిష్కరించాలని ఒకరోజు సమ్మె



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఒకరోజు సమ్మె చేపట్టారు. గురువారం సీఐటీయూ కార్యాలయం నుండి ర్యాలీగా తరలివచ్చి కలెక్టరేట్ ఎదుట టెంట్ వేసుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించే విషయంలో విఫలమైందన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు ఆరు నెలల నుండి పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించడం లేదన్నారు. కార్మికులు జీవనం కొనసాగించాలంటే ఇబ్బందిగా ఉన్నటువంటి పరిస్థితులు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులకు రూ.150 కోట్లు విడుదల చేసింది కానీ కార్మికులకు ఇప్పటి వరకు వారి అకౌంట్లో నయా పైసా కూడా ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం సమ్మె చేస్తున్న సందర్భంలో అనేక హామీలు ఇచ్చారని వారి మాటలు విని గ్రామపంచాయతీ కార్మికులు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కారం చేస్తుందని ఆశతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెనెక్కించారన్నారు. కానీ ఈ రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల పట్ల నిర్లక్ష్యం వ్యవహరిస్తుందని మండిపడ్డారు. కనీస వేతనం రూ.26 వేల రూపాయలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలని, ప్రత్యేక బడ్జెట్ ఇవ్వాలన్నారు. జీఓ నెంబర్ 51ని సవరించాలని మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, ఇన్సూరెన్స్ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా ఆలోచించి గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సోనేరావు, వెంకట్‌రావు, ఇంద్రాజ్, ఆడేళ్ళ, అశోక్, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు రఫీ, దశరథ్, సుందర్, అశోక్, రమేష్, చిన్ను, రాంషో, బాధిరావు, గోవింద్, రాధ పాల్గొన్నారు.

రుణమాఫీ సంతోషం బ్యాంకు వరకే

- ఆందోళన కలిగిస్తున్న నో డ్యూ సర్టిఫికెట్



నవతెలంగాణ-నేరడిగొండ

తాము తీసుకున్న రుణాలు మాఫీ అవుతాయని రైతులు ఎంతో సంతోష పడ్డారు. కానీ వారి సంతోషం బ్యాంకుల వరకే మిగిలిపోయింది. తెలంగాణ ప్రభుత్వం రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ చేస్తూ ఖాతాలలో డబ్బులు జమ చేస్తుంది. డబ్బుల విషయంలో రైతులు బ్యాంకు వెళ్తే గ్రామీణ బ్యాంక్ అధికారులు సెర్ఫ్(వెలుగు) కార్యాలయం నుండి నో డ్యూ సర్టిఫికెట్ తీసుకురావాలని లబ్ధిదారులకు సూచిస్తున్నారు. సెర్ఫ్ అధికారులు పాత బాకి ఉందని నో డ్యూ సర్టిఫికెట్ ఇచ్చారు. దీంతో రుణమాఫీ డబ్బులను పాత బకి కింద జమ చేసుకుంటున్నరని రైతులు ఆరోపిస్తున్నారు. స్వయంగా కలెక్టర్ అధికారులకు ఎలాంటి కోత లేకుండా రుణమాఫీ ఇవ్వాలని ఆదేశాలిచ్చిన ఫలితం లేకుండా పోతోందని రైతులు అంటున్నారు. ఈ విషయంపై సెర్ఫ్ ఏపీఎం ఉత్తమ్‌ని వివరణ కోరగా 8, 9 సంవత్సరాలుగా బ్యాంక్ నుండి వెలుగు ద్వారా తీసుకున్న బాకీ తిరిగి కట్టక పోవడంతో ప్రభుత్వం చేస్తున్న ఈ రుణమాఫీలో నుండి కాట్ చేసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం రుణమాఫీ చేస్తు ఖాతాలలో డబ్బు జమ చేస్తుంది కానీ బ్యాంకులలో పాత బాకీ ఉందని రుణమాఫీ డబ్బులు కట్ చేసుకుంటున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు.

దాడిచేసిన పోలీసులను అరెస్ట్ చేయాలి

- విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

న్యాయవాదులపై దాడి చేసిన పోలీసులపై ప్రభుత్వం ఎఫ్ఆర్ఐ నమోదు చేసిందని వెంటనే వారిని అరెస్టు చేయాలని ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేష్ డిమాండ్ చేశారు. జనగామలో పోలీసులు న్యాయవాదులు అమృత రావ్, కవితలపై దాడి చేయడాన్ని నిరసిస్తూ గురువారం విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. రక్షణ చట్టాన్ని తీసుకురావాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేష్ మాట్లాడుతూ కేసు విషయంలో జనగామ పోలీసులపై ప్రభుత్వం కేవలం ఎస్ఆర్ఐ నమోదు చేసి చేతులు దులుపుకుందన్నారు. వెంటనే వారిని అరెస్టు చేయాలన్నారు. పోలీసులు, న్యాయవాదుల పరస్పర సంబంధాలు బాగుండాలని, దాడులకు పాల్పడవద్దని హితవు పలికారు. దాడులు ఇలానే కొనసాగితే అన్ని బార్ కార్యాయాల్లో విధులు బహరిష్కరించి పోలీసులకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎంబడి సంతోష్, క్రీడాల కార్యదర్శి ముజహిద్, శ్రీనివాస్ రెడ్డి, ఎండీ గౌస్, రవీందర్, మల్లిఖర్జున్, మన్నీర్, ఇమాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్ : నిరంతరం వృత్తిలో న్యాయం కోసం పాటుపడుతున్న న్యాయవాదులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని ఉట్నూర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బానోత్ జగన్, ఉపాధ్యక్షులు ధీరజ్ గుప్తా డిమాండ్ చేశారు. జనగామలో న్యాయవాద దంపతులపై పోలీస్‌ల దౌర్జన్యానికి నిరసనగా గురువారం న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన తెలిపారు. దాడులకు నిరసనగా 8, 9 తేదీల్లో విధులు బహిష్కరిస్తూ తీర్మానం చేశామన్నారు. న్యాయవాదులపై తరుచుగా జరుగుతున్న దాడులను నియంత్రించాలంటే న్యాయవాదుల రక్షణ చట్టం అమలుతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కోశాధికారి చింతల గిరి, న్యాయవాదులు బానోత్ జైవంత్ రావు, పవార్ వసంత్ రావు, కుడెల్లి అశోక్, నాతరి రాజు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్



ఉట్నూర్

మాజీ మంత్రికు సోదర వియోగం



నవతెలంగాణ-జైనథ్

మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న పెద్ద అన్న జోగు పోతారెడ్డి మరణించారు. మండలంలోని దీపాయిగూడ గ్రామంలో గురువారం అనారోగ్యంతో చనిపోవడంతో ఆయన పార్థివ దేహానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్, లోక ప్రవీణ్‌రెడ్డి, సీపీఐ(ఎం) నాయకులు లంక రాఘవులు, బండి దత్తాత్రి, కౌన్సిలర్లు సంద నర్సింగ్, భూమన్న, ఇమ్రాన్ నాయకులు ఎంప షకీల్, బాయిన్‌వార్ గంగారెడ్డి, బండారి చిన్నయ్య పరామర్శించారు.

బురదమయమైన రోడ్డును పట్టించుకోరా..?

నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలం కమటవాడ గ్రామపంచాయతీ పరిధిలోని గోవిందపూర్ నగర్‌లో రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు అన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డు పూర్తిగా బురదమయంగా మారడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రోడ్డు దుస్థితి అధ్వానంగా తయారైందని కానీ ఏ ఒక్క అధికారి, నాయకులు పట్టించుకోక పోవడంతో గ్రామస్తులు స్వచ్ఛందంగా రోడ్డుపై ఉన్న బూరదలో చెట్టు కొమ్మలు వేసి రాకపోకలను కొనసాగిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరారు.

జ్వరంతో ఆదివాసీ యువతి మృతి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



మండలంలోని తుమ్మగూడ గ్రామానికి చెందిన కొట్నాక్ జ్యోతి (22) ఆదివాసీ యువతి రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతూ మరణించింది. కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ఓ ప్రైయివేట్ ఆస్పత్రిలో చికిత్సలు చేయించారు. బుధవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురికాగా గురువారం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు అక్కడి వైద్యులు పేర్కొన్నారు. కొట్నాక్ భీమ్ రావ్ కలాబాయి దంపతులకు నలుగురు సంతానంలో పెద్ద కుమార్తె మృతి చెందటంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

తరగతి గదిలోనే విద్యార్థుల భవిష్యత్తు



నవతెలంగాణ-జైనథ్

తరగతి గదిలోనే విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణం అవుతుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం మండలంలోని కాన్పమేడిగూడ రోడ్‌లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు తరగతిలో నిర్మాణం అవుతుందన్నారు. ఉపాధ్యాయులు చెప్పింది శ్రద్ధగా విని ఇంటి దగ్గర ప్రాక్టీస్ చేసుకోవాలని పదోతరగతి విద్యార్థులకు సూచించారు. విద్యార్థులతో బోర్డుపై రాయించి వివరించామన్నారు. విద్యార్థుల విశ్లేషిస్తూ చెప్పిన విధానం చూసి అభినందించారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏర్పాట్లను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి వాటిని కాపాడాలన్నారు. ఉన్నత పాఠశాలకు కిచెన్ షేడ్ ఏర్పాటు చేయాలని కోరాగా కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సత్యవాన్ చిక్టే, కొనిగెల నారాయణ, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ సుజాత, మాజీ చైర్మన్ పోలవేణి అడేల్లు, వీడీసీ క్యాతం రాంరెడ్డి, ఉపాధ్యాయురాలు వసుధ, జ్యోతి, ఉపాధ్యాయులు సంతోష్, దేవిదాస్, సదాశివ్, ప్రకాష్, లెనిన్ బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని గౌలిగూడ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ దినేష్ భార్య మృతి చెందింది. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ గురువారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకొని ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట దేవేందర్ రెడ్డి, సురేందర్, ప్రతాప్ ఉన్నారు.

మాజీ జెడ్పీటీసీకి ఆత్మీయ సన్మానం



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని ఖోడద్ గ్రామస్తులు మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి ఐదు సంవత్సరాల పాటు అందించిన సేవలకు గాను సన్మానించారు. గురువారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి అడే గాజేంధర్, మాజీ సర్పంచ్ సాకే ఆనంద్, మాజీ ఎంపీపీ కళ్యాణం లక్ష్మీ రాజేశ్వర్‌లను సత్కరించి సేవలను కొనియాడారు. ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి మాల సంఘ భవనానికి రూ. 5 లక్షలు, శబరిమాత ఆశ్రమానికి రూ.5 లక్షలు, బాజీరావు మహారాజ్ ఆశ్రమానికి భవన నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేయిస్తానని నియోజకవర్గ ఇన్‌చార్జి అడే గాజేందర్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు ప్రఫూల్ రెడ్డి, సాకే ఆనంద్, లాస్మన్న, మాజీ ఎంపీటీసీలు కమలాకర్, వెంకన్న యాదవ్, మాజీ కో ఆప్షన్ మెంబర్ బాబు ఖాన్, సి.వెంకట్ రెడ్డి, సుశీల్ రెడ్డి, నారాయణ్ రెడ్డి, లాస్మ రెడ్డి, లోక ప్రవీణ్ రెడ్డి, సాంబశివ్, రఫిక్, దేవదాస్, నల్ల దేవిదాస్, సుదర్శన్, సంతోష్, మల్లయ్య యాదవ్, రాంచందర్ దేశ్‌ముఖ్, క్యాతం గంగమ్మ ప్రతాప్, శబరిమత, బాజీరావు బాబా భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా రోడ్డు మరమ్మతు పనులు

- డీఎల్‌పీఓ ప్రభాకర్



నవతెలంగాణ-నార్నూర్

గ్రామాల్లో ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా రోడ్డు, కల్వర్టు మరమ్మతు పనులు నిర్వహిస్తున్నట్లు డీఎల్‌పీఓ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం గాదిగూడ మండలంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌తో కలిసి ధాబా(కే)లో భారీ వర్షానికి పాడైన కల్వర్టు, రోడ్డుపై ఉన్న గుంతలను మరమ్మతు పనులు చేయించారు. వర్షాకాల నేపథ్యంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త చెదారం తొలగించారు. అనంతరం మండలంలోని రోమన్ కాసా, ఖడ్కి, లోకారి గ్రామాల్లో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీఓ సాయి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు రంజిత్, ఆనంద్, విజయ్, సుభాష్ ఉన్నారు.

ఉద్యమకారులకు పెన్షన్ అందించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి పెన్షన్‌లు అందించాలని 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మార్త సత్యనారాయణ కోరారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1969లో ఉద్యమకారులు పది నెలలు ఉద్యమం చేసి ఏడాది పాటు విలువైన విద్యా సంవత్సరాన్ని కోల్పోయారన్నారు. వారిని ఆదుకోక గత ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందన్నారు. తొలి, మలి దశ ఉద్యమకారులను గుర్తించి వారికి పెన్షన్లు, సమరయోధుల హోదా, వారి పిల్లలకు రిజర్వేషన్లు, డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరయ్యేలా చూడాలని కోరారు కార్యక్రమంలో రమణయ్య, ఎస్ఆర్ మూర్తి, నాగేశ్వర్‌రావు, చిలుక లక్ష్మినారాయణ, కోటేశ్వర్‌రావు, మహ్మద్ ఫారూఖ్ పాల్గొన్నారు.


జాతీయ ఉత్తమ అవార్డుకు గుండి అంగన్‌వాడీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆసిఫాబాద్ మండలం గుండి అంగన్‌వాడీ కేంద్రం జాతీయ ఉత్తమ అంగన్‌వాడీ అవార్డుకు ఎంపికైంది. ఈ నెల 15న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి అవార్డు అందుకోనుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ విజయ లక్ష్మిని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ గురువారం తన నివాసంలో ఘనంగా సన్మానించారు. భవిష్యత్తు మరిన్నీ అవార్డులు పొందాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జాబరీ రవీందర్, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు వనిత, సువర్ణ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ అనుబంధ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు వారిని పర్మినెంట్ చేసి, కనీస వేతనాలు అమలు చేయాలని అన్నారు. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వమే కార్మికుల వేతనాలకు ప్రత్యేక గ్రాంట్ కేటాయించాలని, పీఆర్‌సీలో అర్హులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో 48 గంటల నిరాహారదీక్షలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమేష్, విజయ్, మహేష్, రాజేష్, సురేష్, మధు, సుధాకర్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : తెలంగాణ గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు వెళిశాల కృష్ణమాచారి అన్నారు. గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఒక్కరోజు సమ్మె చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా పారిశుద్ధ్యంతో పాటు అవసర సేవలైన విద్యుత్, మంచినీటి సరఫరాలను కూడా నిలిపివేశామని ఇప్పటికి కూడ ప్రభుత్వం స్పందించకుంటే 48 గంటల నిరహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నగేష్, రాజన్న, లక్ష్మీ, భార్గవ్, పెంటపర్తి రాజ్ కుమార్, దుర్గ, తార, మారుతి, పోశం, శోభన్, భీమయ్య, శ్యాంరావ్, హరిశ్చంద్ర ప్రసాద్, నీలమ్మ, చిపల్లీ విక్రమ్, వెంకటేష్, వెంకన్న ,సుజాత సంతోష్ తిరుమల పాల్గొన్నారు.

కౌటాల : మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గ్రామ పంచాయతీ కార్మికుల ఒక్కరోజు సమ్మె నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్మికుల జిల్లా అధ్యక్షులు జాడే.మోరేశ్వర్ మాట్లాడుతూ మల్టిపర్పస్ విధానం రద్దు చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ అదేవిదంగా జీఓ నంబర్ 51 సవరణ, గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలు నేరవెర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సంఘం నాయకులు, కారోబార్లు, కార్మికులు పాల్గొన్నారు.

కెరమెరి : జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో మండలంలోని వివిధ గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులు ఒకరోజుకు సమ్మెలో పాల్గొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పెండిగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, శాశ్వత ఉద్యోలుగా గుర్తించాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జీపీ కార్మికులు తిరుసుల్ల సంతోష్, పొర్ల స్వామి, మల్లేష్, నాగేష్, శ్రీనివాస్, సరేష్, పోగుల రవి , జీపీ కార్మికులు పాల్గొన్నారు.



సిర్పూర్(టి) : ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న జీపీ కార్మికులు



కౌటాల : సమ్మెలో నినాదాలు చేస్తున్న జీపీ కార్మికులు



కెరమెరి : ఒక్క రోజు దీక్షలో గ్రామపంచాయతీ కార్మికులు

మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- కార్మిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాలడుగు సుధాకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఆసిఫాబాద్‌ను గత ఫిబ్రవరిలో మున్సిపాలిటీగా ప్రభుత్వం ప్రకటించినదని ఆరు నెలలు పూర్తయిన కార్మికుల విభజన ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉందన్నారు. కార్మికులకు వెంటనే మున్సిపల్ వేతనాలు చెల్లించాలన్నారు. కేటగిరీల వారీగా విభజించి జీఓ నెంబర్ 60 అమలు చేయాలన్నారు. కార్మికులకు నెలవారీగా వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షులు పెరిక శ్రీకాంత్, శంకర్, యూనియన్ కమిటీ నాయకులు శ్రీనివాస్, ప్రభాకర్, మల్లేష్, సాగర్, మోతే లక్ష్మి, ఉప్పర లక్ష్మి, పద్మ మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

తెలంగాణ సమగ్ర శిక్షణ సంఘం ఎన్నిక

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలో గురువారం తెలంగాణ సమగ్ర శిక్షణ ఉద్యోగుల సంఘం మండల నూతన కమిటీని జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షురాలుగా కృతిక, ప్రధాన కార్యదర్శిగా తిరుమల, కోశాధికారిగా రవీందర్, ఉపాధ్యక్షులుగా కవిత, అధికార ప్రజా ప్రతినిధిగా సందీప్, సలహాదారులుగా స్వప్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి సమగ్ర శిక్షణ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, రెగ్యులర్ చేసే వరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షణ ఉద్యోగుల సంఘం జిల్లా కోశాధికారి నరేష్, సభ్యులు రమేష్, వెంకటరమణ, నరేందర్, మహేష్ పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీ విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఈనెల 13న హైదరాబాద్‌లో నిర్వహించనున్న విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1994లో 20 మందితో ప్రారంభమైన ఈ ఎమ్మార్పీఎస్ ఉద్యమం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో చైతన్యం వచ్చిందని, దీనికి ముఖ్య కారణం మందకృష్ణ మాదిగ అని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణే లక్ష్యమని పోరాడిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ఎస్సీ వర్గీకరణ పై తీర్పునిచ్చిన నేపథ్యంలో మాదిగలకు ఆగస్టు 1న స్వాతంత్రం వచ్చినట్లు భావిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 13న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో విజయోత్సవ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ విజయోత్సవ ర్యాలీకి ఉమ్మడి ఆదిలాబాద్‌లోని మాదిగ ఉపకులాలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఇందులో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నారాయణ, ఏముర్ల పోశం, మహేష్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



దహెగాం

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్టు ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుండి మహారాష్ట్రకి పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న సమాచారం మేరకు సిర్పూర్ పోలీసులు, రైల్వే ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్ సమక్షంలో రైల్వే స్టేషను వద్ద తనిఖీలు చేశారు. అబ్దుల్ జకీర్ ఆటోను ఆపి తనిఖీ చేయగా 4 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుబడింది. పట్టుకొని బియ్యాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు, రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దహెగాం: మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న 14 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. గురువారం మండలంలోని ఐనం గ్రామంలో అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచి అక్కడి నుండి మహారాష్ట్రకు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన కొండగొర్లె మహేందర్ ఇంట్లో తనిఖీ చేపట్టగా అతని ఇంట్లో అక్రమంగా తరలించడానికి సిద్ధంగా ఉన్న 14 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని మండల పోలీస్ స్టేషన్‌కు తరలించి అతనిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్ ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. ఈ తనిఖీలో టాస్క్ ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, ఎస్ఐ వెంకటేష్, పీసీ మధు, రమేష్ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మొక్కలు నాటి సంరక్షించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భావితరాలకు సహజమైన స్వచ్ఛమైన వాయువును అందించేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో అందరూ స్వచ్ఛందంగా పాల్గొని పారిశుధ్యం, మొక్కల సంరక్షణకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి గ్రూప్ సభ్యులు ఆర్థికంగా ఎదగడానికి రుణాలు మంజూరు చేస్తుందని దీనిలో కిరాణా దుకాణాలు, పశుసంపద ఉపాధిగా చేసుకోవాలన్నారు.

సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు చర్యలు

వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం మండలం



కెరమెరి : మొక్కలు నాటుతున్న జడ్పీ సీఈఓ లక్ష్మీనారాయణ



సిర్పూర్(టి) : మొక్కలు నాటుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

లోనవెల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి ఆస్పత్రి వార్డులు, రిజిస్టర్లు, ఫార్మసీ, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, విష జ్వరాలను అరికట్టేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వ్యాధులు వ్యాప్తి చెందకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, వ్యాధుల నియంత్రణకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ తుకారం భట్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కెరమెరి : మొక్కల సంరక్షణ అందరి బాధ్యతని జెడ్పీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. నాల్గవ రోజు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని చౌపన్ గూడ, ఝరి, కెస్లాగూడ గ్రామాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అంజాద్ పాషా, నోడల్ అధికారి ఆడే ప్రకాష్, ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య, ఈసీ ఆఖ్యా నాయక్, ఈజీఎస్ సిబ్బంది మహేందర్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 15న స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వైభవోపేతంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే తెలిపారు. గురువారం స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించనున్న పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను పరిశీలించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా సమావేశ మందిరంలో ఎస్పీ డీవీ.శ్రీనివాస్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి జిల్లా అధికారులతో వేడుకల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేడుకలలో భాగంగా ప్రశంసా పత్రాలు, శకటాల ప్రదర్శన, ఆయా శాఖలకు సంబంధించిన స్టాళ్ల ఏర్పాటు, ప్రసంగ ప్రతి, దేశభక్తి గీతాలాపన, సాంస్కృతిక కార్యక్రమాలు ఇతరత్రా స్వాతంత్ర దినోత్సవ సంబంధిత అన్ని కార్యక్రమాల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలన్నారు. ఉదయం 10 గంటలకు పతాక ఆవిష్కరణ ఉంటుందన్నారు. వేడుకలలో ఉత్తమ సేవలు అందించిన ఆయా శాఖల అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలతో పాటు స్వాతంత్ర సమరయోధులకు సన్మాన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేసే దిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

'అవినీతికి తావు లేని పాలన అందిస్తా'

- సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

అవినీతికి తావు లేని పాలన అందిస్తానని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. గురువారం తన నివాసంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. 178 మందికి సంబంధించిన రూ. 52.32 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం నుండి మంజూరైన పరిహారాన్ని అందించడంలో అవినీతి జరిగిందని, ప్రస్తుతం ఎలాంటి అవినీతికి తావుండదని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని ప్రాణహిత ప్రాజెక్టును తిరిగి చేపడతామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించడం సంతోషకరమని అన్నారు. నియోజకవర్గంలో పర్యాటక ప్రాంతాలైన సిద్దేశ్వర గుట్టలు, పాలరాపు గుట్ట, కంకాళమ్మ గుట్ట, పర్వత ప్రాంతమైన మొర్లిగూడ ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పర్వత పరియోజన కింద రోప్‌వేల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దోని



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

శ్రీశైలం, పట్టణ అధ్యక్షులు సిందం శ్రీనివాస్, నాయకులు వి శ్రీదేవి, ఎస్ లక్ష్మి, కొలిపాక కిరణ్, కృష్ణకుమారి, మల్లిక్ పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలకు ఇన్‌స్పైర్ దోహదం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

విద్యార్థులలో వినూత్న ఆలోచనలకు ఇన్‌స్పైర్ దోహదపడుతుందని జిల్లా సైన్స్ అధికారి కటకం మధూకర్ అన్నారు. గురువారం జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇన్‌స్పైర్ ఒరియంటేషన్ ప్రోగ్రాంను కాగజ్‌నగర్‌లోని డీఆర్‌సీలో నిర్వహించారు. ఈ సందర్భంగా మధూకర్ మాట్లాడుతూ ఆరు నుండి పదో తరగతి విద్యార్థులకు ఇన్‌స్పైర్ నామినేషన్లు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి పాఠశాలలో ఐడియా బాక్స్‌లు ఏర్పాటు చేసి తమ చుట్టూ ఉన్న సమస్యలను విద్యార్థులు గుర్తించేలా చేయాలని అన్నారు. ఎన్నికైన ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ. 10 వేలు అందిస్తుందని తెలిపారు. ప్రతీ పాఠశాల నుండి ఐదు నామినేషన్లు తప్పనిసరిగా ఉండేలా చూడాలని అన్నారు. అనంతరం ఇన్‌స్పైర్ నామినేషన్లు ఎలా ఉండాలనే విషయంలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ మామిడాల తిరుపతయ్య, జిల్లాలోని సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పులి సంచారంపై విస్తృత ప్రచారం



గ్రామంలో పులి సంచారంపై అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ అధికారులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మూడు రోజులుగా పులి ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలో సంచరిస్తుండడంతో అటవీశాఖ అధికారుల ఆధ్వర్యంలో గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మండలంలోని చిర్రకుంట గ్రామంలో సెక్షన్ అధికారులు సాయి, మహేందర్ గ్రామంలో డప్పు చాటింపు చేసి గ్రామస్తులను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మంగళవారం చిర్రకుంట సమీపంలోని ఎర్రగుట్ట మీద ఆవుపై దాడి చేసి దానిని చంపి వేసిందన్నారు. ప్రస్తుతం పులి ఆ ప్రాంతంలో సంచరిస్తుందని మేకల కాపరులు అటువైపు వెళ్లకూడదన్నారు. ఆ ప్రాంతంలో పంట పొలాలను కలిగి ఉన్నవారు పనులు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అటవీశాఖ అధికారులకు సహకరించాలని కోరారు. పులి జాడలు కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో బీట్ అధికారి వెంకటేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగుడుకు బానసై వృద్ధుడి ఆత్మహత్య

నవతెలంగాణ-కౌటాల

తాగుడుకు బానసై వృద్దుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కన్నెపెల్లిలో జరిగింది. ఎస్సై ఎస్.మధుకర్ తెలిపిన వివరాల ప్రకారం టాకిరె హన్మంతు(69) కొంత కాలంగా తాగుడుకు బానసై ఈ నెల ఏడున మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి పడి ఉన్నాడు. కుటుంబ సభ్యులు చేను పనులు ముగించుకుని ఇంటికి వచ్చి చూస్తే అపస్మారక స్థితిలో పడి ఉన్న హన్మంతును కౌటాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్య కోసం మంచిర్యాలకు తీసుకు వెళ్తుండగా మార్గమధ్యంలో చనిపోయారు. మృతుని కుమారుడు టాకిరె బాబురావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-జైపూర్



సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు డాక్టర్ అనిల్, డాక్టర్ ప్రసాద్ సూచించారు. గురువారం భీమారం మండల కేంద్రంలో గల పద్మశాలి వాడలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వ్యాధుల వ్యాప్తి, నివారణ చర్యలను వివరించారు. పద్మశాలి వాడకు చెందిన 50 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. వర్షా కాలం సీజన్‌లో సురక్షిత నీరు తాగాలని, ఆహారం వేడిగా ఉన్నప్పుడు మాత్రమే తినాలని తెలిపారు. ఇంటి పరిసరాల్లో ఈగలు, దోమలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నీటి పాత్రలు వారంలో ఒక రోజు ఆరబెట్టుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వేణు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ-మంచిర్యాల



స్థానికంగా ఏర్పాటు చేసిన మంచిర్యాల మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు గురువారం ప్రారంభించారు. అనంతరం చున్నంబట్టిలో నూతనంగా ఏర్పాటు అయిన కియా కార్ షో రూమ్‌ను చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ పాల్గొన్నారు.

నాసిరకం పనులపై విచారణ చేపట్టాలి

● ఐక్య విద్యార్థి సంఘాల డిమాండ్



నవతెలంగాణ-మందమర్రి

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో నాసిరకం పనులపై విచారణ జరిపించాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలల నాసిరకం పనులపై సమగ్ర విచారణ జరిపి బిల్లులు నిలిపివేయాలని కోరుతూ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం మందమర్రి ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు టీవీయూవీ రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్, ఎన్ఎస్సి జిల్లా అధ్యక్షులు పూరెళ్ల నితీష్‌లు మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనులు పూర్తిగా లోప భూయిష్టంగా పనులు చేపట్టారని, కొన్ని పాఠశాలల్లో చేసిన పనులు పూర్తిగా పగుల్లు తేలి దర్శనమిస్తునాయని, పనుల్లో నాసిరకం వస్తువులు వినియోగించారని ఆరోపించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన పనులపై విచారణ జరిపించి, నాణ్యత లేమిగా చేసిన కమిటీలకి బిల్లులు చెల్లించవద్దని కోరారు. అదే విధంగా ఇప్పటికి కొన్ని పాఠశాలల్లో పనులు పూర్తికాలేదని వాటిని త్వరితిగతిన పూర్తి చేసేలా ఎంఈఓ పాఠశాల కమిటీలను ఆదేశించాలని పేర్కొన్నారు.

త్వరలో నైనీ బ్లాక్‌లో చెట్ల గణన ప్రారంభం

నవతెలంగాణ-జైపూర్

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఒడిశా పర్యటన తర్వాత నైనీ బొగ్గు బ్లాకుకు సంబంధించిన మిగులు పనులు వేగంగా జరుగుతున్నాయని సింగరేణి యాజమాన్యం వెల్లడించింది. ఇప్పటికే 643 హెక్టార్ల రిజర్వ్‌డ్ అటవీ భూమిని సింగరేణికి బదలాయిస్తూ ఒడిశా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా తాజాగా మరో 140 హెక్టార్ల అటవీ భూమి అప్పగించడంపై సింగరేణి సీఎండీ బలరామ్ ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కాగా నైనీ బొగ్గు బ్లాకు నుంచి ఉత్పత్తి ప్రారంభించడానికి వీలుగా చెట్ల గణన, తొలగింపు ప్రక్రియకు కూడా పూర్తి స్థాయి సహకారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహూజాను కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. 10 రోజుల్లో చెట్ల గణన ప్రక్రియ చేపట్టే విషయంపై ఆయన హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. బుధవారం సాయంత్రం ఒడిశా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొత్త బ్లాక్‌ల స్థితిగతులపై ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎండీ బలరామ్ మాట్లాడారు. సమావేశంలో కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి అమృతలాల్ మీనా ఒడిశా రాష్ట్ర ముఖ్య కార్యదర్శి మనోజ్ అహూజా, ఒడిశా రాష్ట్ర బొగ్గు స్టీల్ మంత్రిత్వ శాఖ, అటవీ శాఖ కార్యదర్శులు ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్‌వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సరుకుల మాదిరి 'మద్యం' సరఫరా..!

● వాహనాల ద్వారా కిరాణ, బెల్టు షాపులకు పంపిణీ
● మామూలుగా తీసుకుంటున్న అధికారులు

నవతెలంగాణ-జైపూర్

ఈ ఫోటోలో కన్పిస్తున్న వాహనం.. మద్యం తరలిస్తూ జైపూర్ మండలం కిష్టాపూర్‌లో ఇటీవల కన్పించింది. హోల్‌సేల్ వ్యాపారులు గ్రామాల్లోని కిరాణ షాపులకు నిత్యవసర సరుకులు తరలించే విదంగా వైన్స్ షాపుల యజమానులు వాహనాల ద్వారా మద్యం తరలిస్తున్నట్లు బహిర్గతమైంది. కిరాణ వస్తువులు తరలించినట్లు మద్యం షాపుల వారు కూడా వాహనాల ద్వారా గ్రామాల్లోని బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తున్నారు. ఒక్క కిష్టాపూర్ మాత్రమే కాదు మండల పరిధిలోని 20 గ్రామ పంచాయతీలకు మద్యం సరఫరా చేస్తూ అందరికి అందుబాటులో మందు అన్నట్లుగా వైన్ షాపుల వారి అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లుగా కొనసాగుతోంది. ఈ విధంగా సరఫరా అవుతున్న మద్యం ప్రతి గ్రామంలో బెల్టు షాపులు, కిరాణ షాపుల్లో అందుబాటులో ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. మండల కేంద్రంలో గల వైన్ షాపుతో పాటు ఇందారం గ్రామంలో గల వైన్ షాపుల ద్వార ఊరూరా మద్య సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం అనుమతిచ్చిన ఈ రెండు వైన్ షాపుల ద్వార విచ్చల విడిగా గ్రామాల్లో ఏర్పాటు చేసుకున్న బెల్ట్ షాపులకు ప్రత్యేక వాహనాలతో యదేచ్చగా మద్యం సరఫరా చేస్తున్నారు. మండల పరిధిలో అనుమతి పొందిన రెండు వైన్ షాపులు ఒక్కరి నిర్వాహణలో కొనసాగుతుండగా ఇక్కడి నుంచి గ్రామ పంచాయతీలకు మద్యం తరలిస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా మందు తరలిపోతుందని అనుకుంటే తప్పులో కాలేసినట్లే.. మిట్ట మధ్యాహ్నం మద్యం తరలిస్తున్న తీరును ఫోటోలు తీసినా.. వీడియోలు తీసినా మాకేం ఇబ్బంది లేదు అన్నట్లుగా వారి పని వారిదే తప్పా ఇతరులను పట్టించుకోరు.



రోజు విడిచి రోజు ఇందారం, జైపూర్ వైన్ షాపుల నుండి ప్రత్యేక వాహణాల ద్వార మండల పరిధిలో మద్యం సరఫరా చేస్తున్నారు. పండుగలు, పెండ్లీలు ఉన్న రోజుల్లో రోజు వారిగా మద్యం సరఫరా అవుతుందని పలువురు పేర్కొంటున్నారు.

పట్టించుకోని సంబంధిత అధికారులు

మండంలోని పలు గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు కొనసాగుతున్నా ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారం అన్ని చోట్ల సాగుతుందని మామూలుగా తీసుకుంటున్నారు. వైన్ షాపు యజమానులు నిబంధనల మేరకు విక్రయాలు సాగించాల్సి ఉంటుంది. కాని అధికారుల సహకారంతో మంలంలో విచ్చలవిడి మద్యం విక్రయాలు సాగుతున్నా అధికరులు మాత్రం బెల్టు షాపులు అనేటివి చాటుమాటున నడిపించే వ్యవహరమని, తమ దృష్టికి వస్తేనే చర్యలు తీసుకుంటామని చెప్పుకోవడం కొసమెరుపు.

వాహనాల్లో తరలించడం సరికాదు

అనీషా రాథోడ్, ఎక్సైజ్ ఎస్ఐ

వైన్ షాపు యజమానులు వాహనాల్లో మద్యం తరలించడం సరికాదు. అలాంటివి తమ దృష్టికి వస్తే తప్పక చర్యలు తీసుకుంటాం. ఎక్కువ మొత్తంలో మద్యం తరళిస్తే వాటిని సీజ్ చేస్తాం. బెల్టు షాపుల నిర్వాహణ విషయంలో పై అధికారుల దృష్టికి తీసుకువెల్తాము. అవసరమైన ఆయా గ్రామాల్లో దాడులు నిర్వహించి అక్రమ మద్యాన్ని సీజ్ చేసి సదరు నిర్వాహకులపై కేసులు పెడతాం.

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలి



నవతెలంగాణ-లక్షెట్టిపేట

న్యాయం కోసం పాటుపడుతున్న న్యాయవాదులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని లక్షెట్టిపేట బార్ అధ్యక్షుడు జి కిరణ్, ఉపాధ్యక్షుడు గాండ్ల సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ నెల 5న జనగామలో న్యాయవాద దంపతులపై పోలీస్‌ల దౌర్జన్యానికి నిరసనగా గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదులపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. న్యాయవాదులపై దౌర్జన్యానికి పాల్పడ్డ సీఐ, ఎస్సైలను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులపై తరుచుగా జరుగుతున్న దాడులను నియంత్రించాలంటే న్యాయవాదుల రక్షణ చట్టం అమలుతోనే సాధ్యమని ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రాజేశ్వరరావు, భూమారెడ్డి, అక్కల శ్రీధర్, సురేందర్, రవీందర్, అఫ్జల్, ప్రదీప్, పద్మ, రాజేశ్వర్, షఫీక్, గణేష్, సునీల్ పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం గడువు పొడిగింపు

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి యాజమాన్యం సామాజిక బాధ్యతగా చేపట్టిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం గడు పొడిగిస్తున్నట్లు సింగరేణి సీఎండీ బలరాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన యువత సివిల్స్ ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధిస్తే సింగరేణి తరపున రూ.1 లక్ష ఆర్థిక సాయం అందజేయడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ నెల 20న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క చేతుల మీదుగా ఈ పథకం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా లబ్ధీ పొందాలనుకున్న వారికి ఈ నెల 6 వరకు గడువు విధించగా అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు ఈ నెల 12 వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు.

దాడి చేసి కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండలం సుంకరిపల్లికి చెందిన కోట విష్ణు అతని స్నేహితుడు సెగ్గెం అరున్ కుమార్‌పై దాడి చేసి కులం పేరుతో దూషించిన నాంపెల్లి సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై రాములు తెలిపారు. బాధితుడు కోట విష్ణు పిర్యాదు మేరకు సెగ్గెం అరున్ కుమార్‌తో కలిసి కోట విష్ణు మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తుండగా ఆరెపల్లి రోడ్డులో ఎదురుగా కారులో వచ్చిన నాంపెల్లి సంతోష్ కారు డోర్‌ను మోటార్ సైకిల్‌కు తగిలించారు. మెల్లిగా చూసుకుని నడుపాలన్న విష్ణు, అతని స్నేహితుడు సెగ్గెం అరున్ కుమార్‌లపై భౌతికంగా దాడి చేయడంతో పాటు అరే నేతకానోడా అంటూ కులం పేరుతో నాంపెల్లి సంతోష్ అతని స్నేహితులు దూషించినట్లు తెలిపారు. ఊహించని విధంగా దాడికి పాల్పడిన సంతోష్‌తో పాటు ఆయన స్నేహితుల నుంచి తప్పించుకోవడం కోసం వైన్ షాపులోకి ఒకరు వైన్ షాపు వెనుక వైపు మరోకరు పారిపోయినట్లు బాధితుడు పిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఒక వైపు దాడి చేయడమే కాకుండా మరో వైపు సెగ్గెం అరున్ కుమార్ మెడలో గల రెండు తులాల పావు బంగారు గొలుసు లాక్కోవడమే కాకుండా కోట విష్ణుకు సంబందించిన సెల్ ఫోన్ ధ్వసం చేసినట్లు వివరించారు. ఈ మేరకు నాంపెల్లి సంతోష్‌తో పాటు ఆయనతో కలిసి దాడికి పాల్పడిన అతని స్నేహితులపై కేసు నమోదు చేశారు.

ఐటీ హబ్ ఏర్పాటుకు ముందుకు రావాలి

● ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా అభివృద్ధిలో భాగంగా ఏర్పాటయ్యే ఐటి హబ్, పరిశ్రమల ఏర్పాటుకు జిల్లాలోని వ్యాపారస్తులు, ప్రజలు పెద్ద ఎత్తున ముందుకు రావలని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో జిల్లాలోని వ్యాపారులతో సమవేశం నిర్వహించారు. మంచిర్యాల సమీపంలోని వెంపల్లిలో 250 ఎకరాల్లో రాబోయే రోజుల్లో ఇండస్ట్రీయల్ హబ్, ఐటీ పార్కుకు ఏర్పాటు చేసేందుకు ,ఇప్పటికే భూ సేకరణ జరిగిందన్నారు. వ్యాపారులు ముందుకు వస్తే భూమి కేటాయింపులో జాప్యం లేకుండా కేటాయింపు జరుగుతుందని భరోసా ఇచ్చారు. విద్యుత్, నీరు, రహదారి ఇతర సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. రూ.కోటి నుంచి 100 కోట్లకుపైగా వ్యాపారాలు చేయడానికి ముందుకు వచ్చిన వారికి ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. ఖనిజ, బొగ్గు వనరులతో పాటు రైల్వే రవాణా మార్గం ఉండడం వ్యాపారులకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. అంతే కాకుండా సమీపంలో ఎయిర్ పోర్ట్ కూడా ఏర్పాటు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కుమార్ దీపక్, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ మల్సూర్, ఇండస్ట్రియల్ ఉన్నత అధికారులు నిఖిల్ చక్రవర్తి ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్థలం పరిశీలించిన సంబందిత అధికారులు

హాజీపూర్ : మండలంలోని వేంపల్లి, పోచంపాడు రెవెన్యూ ప్రాంతాల్లో ఇండస్ట్రియల్ హబ్, ఐటీ పార్కుకు అనువైన 292 ఎకరాల భూమిని గురువారం ఇండస్ట్రియల్ ఉన్నతాధికారులు పరిశీలించారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమసాగర్‌రావు నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఎన్నికల హామీలో జిల్లాకు ఇండస్ట్రియల్ హబ్, ఐటీ పార్కు తీసుకువస్తానని హామీ మేరకు త్వరలో కార్యరూపం దాల్చేలా అంకురార్పణ చేశారు. గురువారం హైదరాబాద్ నుంచి డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ మల్సూర్, టీజీఐఏసీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ నిఖిలచక్రవర్తిల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి స్థల పరిశీలన చేపట్టారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం సేకరణకు సిద్ధంగా ఉన్న భూముల వివరాలను ఆరా తీశారు. వీరి వెంట హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్పాండే, ఆర్ఐ మంగ, ప్రభు, సర్వేయర్ కృష్ణవేణి పాల్గొన్నారు.



స్వచ్ఛమైన వాతావరణం నెలకొల్పడమే లక్ష్యం

● మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

ప్రజలకు ఆరోగ్యవంతమైన స్వచ్ఛమైన వాతావరణాన్ని నెలకొల్పడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 12, 23 వార్డులలోని ఇందిరమ్మ కాలనీలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత అవసరమని, వర్షాకాలంలో సీజనల్, అంటువ్యాధులు ప్రబలకుండా నిరోధించవచ్చని తెలిపారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువలతో పాటు నివాస ప్రాంతాల శుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని, దోమల వృద్ధిని అరికట్టేందుకు నీరు నిల్వ లేకుండా తొలగింపు చర్యలు, ఆయిల్బాల్స్, బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయాలని తెలిపారు. ప్రతి వార్డులో ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంకులు శు భ్రపరిచి, క్లోరినేషన్, పారిశుధ్యం శ్రమదానం చేయాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, వర్షాకాలంలో పాటించవలసిన జాగ్రత్తలపై వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, మున్సిపల్ కమీషనర్ చిట్యాల సతీష్, తహసీల్దార్ శ్రీనివాస్, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, వైస్ చైర్మెన్ గెల్లు రజిత పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కవ్వాల్ క్లస్టర్ పరిధిలో ఉన్న దేవుని గూడెం, కామన్ పల్లి, కవ్వాల్ గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న వివిధ రకాల పంటలను జిల్లా వ్యవసాయ అధికారి కల్పన పరిశీలించారు. గురువారం ఆమె గ్రామాల శివారులోని రైతుల పొలాల్లో వేసిన డ్రాగన్ ఫ్రూట్, ఆయిల్ ఫామ్, పత్తి, వరి పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. అనంతరం రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో తదుపరి రుణ మాఫీకి సంబంధించిన పలు సూచనలు చేశారు. రుణ మాఫీ అయిన రైతులు వెంటనే బ్యాంక్ వెళ్లి రెనివల్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సయ్యద్ అక్రముల్ల, రైతులు గుర్రం గోపాల్‌రెడ్డి, కళ్లెం తిరుపతిరెడ్డి, రమణారెడ్డి, ఒడ్నాల చుక్కయ్య కళ్లెం శివ, కళ్లెం రితిక్, బాపురెడ్డి, లచిరెడ్డి పాల్గొన్నారు.

అడవిపంది దాడిలో మహిళకు గాయాలు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని బాదంపల్లి గ్రామానికి చెందిన ముంజం లక్ష్మికి అడవి పంది దాడిలో తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం సాయంత్రం గ్రామ సమీపాన తన పంట చేనులో పనిచేస్తుండగా అడవి పంది దాడి చేసింది. దీంతో ఆమె కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను ఆస్పత్రికి తరలించి కాలికి చికిత్సను చేయించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అటవీ అధికారులకు తమకు సాయం అందించాలని ముంజం లక్ష్మి కోరారు.

మత్తు పదర్థాల నిర్మూలకు ముందుండాలి

నవతెలంగాణ-తిర్యాణి



దేశం వివిధ రంగాలలో రాణించాలంటే దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందని ఎస్ఐ రమేష్ అన్నారు. గురువారం డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గేడం టికానంద్‌తో కలిసి మాదకద్రవ్యాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ దేశ అభివృద్ధి యువతపై ఆధారపడి ఉందని, దేశం వివిధ రంగాలలో రాణించాలంటే యువత మేధస్సు, నైపుణ్యం అవసరమన్నారు. నేటి యువత తమ కర్తవ్యాన్ని విస్మరించి మత్తులో పడిందన్నారు. జ్ఞానాన్ని, విచక్షణను తమ శక్తి సామర్థ్యాలను కోల్పోయి నిర్వీర్యమై నిస్తేజంగా మారుతుందన్నారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలించడంలో యువత, విద్యార్థులు కలిసికట్టుగా ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గేడం టికానంద్, మండల అధ్యక్షులు తాళ్లపల్లి రాజేశ్వర్ పాల్గొన్నారు.

బూరుగుడ కిరాణా దుకాణంలో చోరీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని బూరుగుడ గ్రామపంచాయతీ పరిధిలోని రహపెల్లికి వెళ్లే రహదారిపై ఉన్న కిరాణా దుకాణంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. దుకాణ యజమాని శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం రోజువారీగనే రాత్రి 9 గంటలకు దుకాణం మూసి వేసి ఇంటికి వెళ్లాడు. ఉదయం వచ్చి చూసేసరికి షట్టర్ పగలగొట్టి ఉంది. దుకాణంలో రూ. వేయి నగదుతో పాటు మద్యం బాటిల్స్ దొంగతనానికి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై ప్రవీణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రక్తదానం చేసి.. మహిళను కాపాడి..



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి రక్తహీనతతో బాధపడుతూ వచ్చిన మహిళను రక్తదానం చేసి జర్నలిస్ట్ రాజ్‌కుమార్ ఉదారత చాటారు. ఆసిఫాబాద్ మండలం చిర్రకుంట గ్రామానికి చెందిన మహిళ వివిధ వైద్య పరీక్షల నిమిత్తం జిల్లా ఆస్పత్రికి రాగా మహిళ రక్తహీనతతో బాధపడుతుందని గుర్తించిన వైద్యులు వెంటనే రక్తం ఎక్కించాల్సి ఉంటుందని సూచించారు. దీంతో విషయం తెలుసుకున్న జర్నలిస్ట్ రాజ్‌కుమార్ స్పందించి తనతో పాటు మరొకరిని తీసుకువచ్చి మహిళకు కావాల్సిన రక్తం అందజేశారు. రక్తహీనతతో బాధపడుతున్న మహిళకు రక్తం రక్త అందించిన రాజ్ కుమార్‌ను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలన్నారు. ఆపదలో ఉన్న గర్భిణిని కాపాడడం సంతోషంగా ఉందని తెలిపారు. గర్భిణీ కుటుంబీకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కుమురం భీం విగ్రహావిష్కరణ



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని మురళిగూడ గ్రామపంచాయతీ పరిధిలో గల జిల్లెడ గ్రామంలో శుక్రవారం ఆదివాసీ ముద్దుబిడ్డ కుమురం భీం విగ్రహావిష్కరణ ఉన్నట్లు విగ్రహ ఆవిష్కరణ కమిటీ సభ్యులు తెలిపారు. మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు, పెంచికలపేట ఎస్సైకి ఆదివాసుల ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రిక అందజేశారు. విగ్రహావిష్కరణలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పఠనం పట్టు పెంచుతుంది



నవతెలంగాణ-కౌటాల

జిల్లా విద్యాశాఖ, రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్ ద్వార మండలంలోని కౌటాల కాంప్లెక్స్ పరిధిలో ఉన్న ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటి, రెండవ తరగతి చదువుతున్న విద్యార్థులు రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్ ద్వారా డికోడేబుల్ టెక్స్ బుక్స్‌ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీహెచ్ఎస్ కౌటాల కాంప్లెక్స్ హెచ్ఎం నారాయణ సింగ్ మాట్లాడుతూ ఈ పుస్తకాల వల్ల అక్షర, ధ్వని గుర్తింపు, రీడింగ్ హాబిట్స్, పెరిగి స్వతంత్ర పఠన అభివృద్ధి జరుగుతుందని భావించారు. కార్యక్రమంలో ఎంపీపీఎస్ కౌటాల స్కూల్ హెచ్ఎం గణపతి, రూమ్ టు రీడ్ లెటర్సీ ఫెసిలేటర్స్ సంపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



నవతెలంగాణ-సిర్పూర్(టి)

విద్యార్థులు ర్యాగింగ్ చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై దీకొండ రమేష్ అన్నారు. గురువారం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాగింగ్‌పై అవగాహన కల్పించారు. తోటి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయొద్దని, ర్యాగింగ్ చేయడం నేరమన్నారు. విద్యార్థులు సీనియర్స్, జూనియర్స్ అనేది తేడా లేకుండా స్నేహపూర్వకంగా కలిసి మెలిసి విద్యనభ్యసించాలని సూచించారు. ర్యాగింగ్ లాంటి కేసుల్లో ఇరుకుంటే వారి బంగారు భవిష్యత్తు కోల్పోతారని, గంజాయి మత్తు వ్యసనాలకు బానిసై విద్యార్థులు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కోరారు. ర్యాగింగ్‌కు పాల్పడే వారి వివరాలను డయల్ 100కు తెలియజేసి సాయం పొందవచ్చని సూచించారు.

మండల కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-దహెగాం



మండలం కేంద్రంలో ఎంపీడీఓ సమక్షంలో గురువారం మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చౌదరి రాజేష్ (అయినం జీపీ), ప్రధాన కార్యదర్శిగా ఎల్.రోహిదాస్(పీపీఆర్ ఏఓ కాలనీ జీపీ), ఉపాధ్యక్షులుగా దుర్గం సుమలత(బీబ్రా), తలండి విజయ్ కుమార్ (రాంపూర్), ట్రెజరర్‌గా ఇందారపు రఘుకుమార్ (చౌక), సోషల్ మీడియా కన్వీనర్‌గా గట్టు శివప్రసాద్(హత్తిని)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పల్లెలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పల్లెలను పరిశుభ్ర పరచడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం మండలంలోని బూరుగుడ గ్రామంలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో అధికారులతో కలసి మొక్కలను నాటారు. పాఠశాల విద్యార్థులు పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములై మొక్కలను నాటాలన్నారు. ఇంటి పరిసరాలలో చెడిపోయిన సామగ్రి బయట పడేయడంతో అందులో వర్షం నీరు చేరి దోమలు తయారవుతాయని, దీంతో జ్వరాల బారిన పడతారన్నారు. ఇంటి పరిసరాల ఆవరణలో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. గ్రామంలో ప్రతి ఇంటికి సర్వే చేసి జ్వరపీడితులను గుర్తించి, వారికి వైద్య చికిత్సలు అందించాలని, సీజనల్ వ్యాధుల వ్యాప్తిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. గ్రామాలలో వీధి కుక్కల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పశు వైద్యాధికారులను ఆదేశించారు. రహదారులకు ఇరువైపులా చెత్త, చెదారం లేకుండా గ్రామపంచాయితీ కార్మికుల చేత ప్రతి రోజు శుభ్రం చేయించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలలో మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలన్నారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలమహిళలతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా అభివృద్ధి పరచడానికి మహిళ శక్తి పథకాన్ని ప్రారంభించిందని, ఈ పథకాన్ని అర్హులైన మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ కూలీ పనులు చేసి మూడు నెలలు అవుతున్న కూలీ డబ్బులు రావడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకరావడంతో వెంటనే పీడీతో మాట్లాడి మూడు రోజులలో వారికి కూలీ డబ్బులు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ ప్రాజెక్టు అధికారి దత్తారం, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీలత పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న జీఎంకు సన్మానం

నవతెలంగాణ-రెబ్బెన



బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్‌గా పని చేసి జీఎం(మార్కెటింగ్) కార్పోరేట్‌కు బదిలీపై వెళున్న జనరల్ మేనేజర్ డి.రవిప్రసాద్ బెల్లంపల్లి ఏరియా అధికారులు సన్మానించారు. జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఏరియాలోని ఆయా విభాగాల అధికారులు ఒక్కోకరిగా అభిప్రాయాలను తెలిపారు. జీఎం సేవలను కొనియాడారు. అనంతరం జీఎం రవి ప్రసాద్‌ని శాలువాతో సన్మానించి పూల మొక్కను అందించారు. కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం మచ్చగిరి నరేందర్, ఖైరిగూడ పీఓలు ఎన్ సత్యనారాయణ, ఎస్ ఉమాకాంత్, సీఎంఓఏఐ అధ్యక్షుడు టి.మధుసూదన్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి పాల్గొన్నారు.

జీఎం ను సన్మానించిన బీజేపీ నాయకులు

గోలేటి సింగరేణి బెల్లంపల్లి ఏరియా జీఎంగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న డి.రవి ప్రసాద్‌ను బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు యలమంచి సునీల్ చౌదరి ఉన్నారు.

బదిలీ పీఓకు సన్మానం

ఖైర్‌గూడ ఓసీలో బదిలీ పై వెళ్తున్న పీఓ ఎస్.సత్యనారాయణను అధికారులు, సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. 15 నెలల పాటు ఖైర్‌గూడ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పని చేసిన ఆయన సేవలను వక్తలు కొనియాడారు. శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఓటూ జీఎంగా బదిలీపై వెళ్తున్నందున శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రవీణ్ వీ ఫాటింగ్, సీఎంఓఏఐ అధ్యక్షుడు మధుసూధన్, సంక్షేమ అధికారి వేణు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సంపూర్ణత అభియాన్‌పై ప్రత్యేక శ్రద్ధ

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో సంపూర్ణత అభియాన్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సంపూర్ణత అభియాన్ అభివృద్ధిపై న్యూఢిల్లీ నుండి నీతి అయోగ్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సుబ్రహ్మణ్యం ఆస్పరేషన్ జిల్లాల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా వైద్యాధికారి తుకారంభట్, డీడీ డబ్ల్యూఓ భాస్కర్, జిల్లా విద్యాధికారి అశోక్, ఏపీడీ రామకృష్ణ, సంపూర్ణత అభియాన్ జిల్లా సమన్వయకర్త మణివేలుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీతి అయోగ్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి పలు సూచనలు సలహాలు చేయగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సంపూర్ణత అభియాన్‌లోని అంశాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల ఆరోగ్యం, పౌష్టిక ఆహార పంపిణీ, శారీరక, మానసిక ఎదుగుదల లోపం ఉన్న పిల్లలను గుర్తించి సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు తగు చర్యలు తీసుకున్నట్లు వివరాచరు. దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వ్యవసాయ రంగ అభివృద్ధిలో భాగంగా రైతులకు పంట సాగుపై అవసరమైన మెళకువలు అందించడంతో పాటు నిషేధిత ఎరువులు, నకిలీ విత్తనాల నియంత్రణపై చర్యలు తీసుకుంటున్నామని, భూసార పరీక్షలు నిర్వహించి కార్డుల జారీకి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని, నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మహిళా సంఘాలను బలోపేతం చేసే దిశగా రివాల్వింగ్ ఫండ్‌ను అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అర్షిన్ అన్నారు. గురువారం మండలంలోని కొండపల్లి, లోడ్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 103 మందికి వైద్య పరీక్షలు చేయగా ఆరుగురు జ్వరంతో బాధపడుతున్నట్టు గుర్తించి వారికి మందులు అందించి సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ వర్షాకాలం జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యార్థులు తినే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో ఎంపీడీఓ ఆల్బర్ట్, సీహెచ్ఓ అనర్తి హల్దర్, ల్యాబ్ టెక్నీషియన్ నాగరాజు, హెల్త్ అసిస్టెంట్ ధర్మారావు, ఏఎన్ఎం సావిత్రి, ఆశా కార్యకర్తలు. పాల్గొన్నారు.

గద్దర్ సంస్మరణ సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల 11న నిర్వహించే ప్రజాయుద్ధనౌక గద్దర్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని సభ ఆహ్వాన కమిటీ కన్వీనర్ అల్లి రాజయ్య కోరారు. గురువారం స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గద్దర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈ సంస్మరణ సభ నిర్వహిస్తున్నామని, దీనికి ఉస్మానియా యూనివర్శిటీ ప్రొఫెసర్ చింతకింది ఖాసిం, తెలంగాణ ధూంధాం వ్యవస్థాపకుడు అంతడుపుల నాగరాజు, సామాజిక ఉద్యమకారుడు సుందిళ్ల రాజన్న హాజరు కానున్నట్లు తెలిపారు. దీనికి మేధావులు, విద్యావంతులు, సామాజిక ఉద్యమకారులు, అభిమానులు తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో ఆహ్వాన కమిటీ సభ్యులు ముంజం ఆనంద్‌కుమార్, ఎం రాజకమలాకర్‌రెడ్డి, జాడి కేశవ్, బి నర్సయ్య, శివప్రసాద్, జి నాగేశ్వర్‌రావు, ఎఎస్ఆర్ మూర్తి, పి రమేష్, పురుషోత్తం, మొండయ్య, సునీల్, మురహరి, ముజమిల్ పాల్గొన్నారు.



విద్యార్థులకు వికాసం పుస్తకాల పంపిణీ



నవతెలంగాణ-తిర్యాణీ

రూమ్ టూ రీడ్ సంస్థ వారి సౌజన్యంతో వికాసం పుస్తకాలను గురువారం మండల విద్యాశాఖ నోడల్ అధికారి కె.అంజయ్య మండలంలోని భీమారం పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్, రూం టూ రీడ్ సంస్థ బ్లాక్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, సీఆర్పీలు రాజేష్, దామోదర్ పాల్గొన్నారు.

25లోపు ఇన్‌స్పైర్ నామినేషన్లు పూర్తి చేయాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆరు నుండి పదవ తరగతి విద్యార్థులకు ఈనెల 25లోపు ఇన్‌స్పైర్ నామినేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి అశోక్ ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఆసిఫాబాద్‌లో జిల్లా సైన్స్ అధికారి మధుకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఇన్‌స్పైర్ ఓరియంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఆరు నుండి పదవ తరగతి విద్యార్థులకు ఇన్‌స్పైర్ నామినేషన్ పూర్తి చేయాలని కోరారు. దీనికిగాను ప్రతి పాఠశాలలో ఐడియా బాక్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులను తమ చుట్టూ ఉన్న సమస్యలను గుర్తించేలా చేయాలన్నారు. ఆ సమస్యల సాధన కోసం చేసే ప్రయత్నంలో భాగంగా ప్రాజెక్టు రూపొందించేలా చూడాలన్నారు. ఎన్నికైన ప్రాజెక్ట్‌కి రూ.పదివేల కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ తిరుపతయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

అక్రమ కేసులకు ఆర్ఎంపీ బలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఐదు సంవత్సరాల క్రితం వృత్తిపరంగా నమోదైన అక్రమ కేసుతో గద్వాలలోని జమ్మిచేడుకు చెందిన ఆర్ఎంపీ గ్రామీణ వైద్యుడు భాస్కర్ యాదవ్ ప్రాణం బలైందని సిర్పూర్(టి) ఆర్ఎంపీ కమిటీ సీనియర్ వైద్యుడు దాస్ అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ అక్రమంగా కేసు నమోదు చేసి అతని ప్రథమ చికిత్స కేంద్రన్ని మూసి వేయడంతో మానసిక వేదనకు గురై వేరే వృత్తి చేయలేక పిల్లలను భార్యను పోషించుకోలేని పరిస్థితి నెలకొనడంతో ప్రభుత్వం అలసత్వం వహిస్తున్న తరుణంలో చేసేదేమీ లేక అతని భార్యకు వీడియో కాల్ ద్వారా ఫోన్ చేసి ఆత్మహత్యా చేసున్నాడన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియాతో పాటు 2 ఎకరాల వ్యవసాయ భూమి ఇచ్చి పిల్లల చదువు బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులు అబ్రార్ హైమ్మాద్, లక్ష్మన్, రజ్జబ్ అలీ, షాకీర్, రఘునాథ్ పాల్గొన్నారు.

రెండో ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



రెండో ఎఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబుకు ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు వినతిపత్రం అందించారు. నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో పని చేస్తున్న రెండో ఏఎన్ఎంలను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, హెల్త్ కార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. వీరి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసి జిల్లా ప్రధాన కార్యదర్శి పుణ్యవతి, రెండో ఏఎన్ఎంలు జె భాగ్య, డి సునీత, ఎం మంజుల, జ్యోతి, గీత, ప్రణవి, మీరా, రాధ, విజయ, జ్యోతి, వెంకటలక్ష్మి, మంగ పాల్గొన్నారు.

వారసంతలో మొక్కలపై అవగాహన

నవతెలంగాణ-రెబ్బెన

మండల గోలేటిలోని వారసంతలో గురువారం స్నేహ కల్చరల్ ఆర్ట్స్ మరియు సేవా సంస్థ ఆధ్వర్యంలో పండ్ల మొక్కలను వల్ల కలిగే ప్రయోజనలను వివరించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బి.గోపాల కృష్ణ మాట్లాడుతూ పండ్ల మొక్కలు అడవిలో నాటడం వల్ల జంతువులు, పక్షులకు వాటి జీవన మనుగడకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దీంతో మనిషి సంపూర్ణ జీవితానికి కావాల్సిన ప్రాణ వాయువు అంది ఆరోగ్యాంగా జీవించడానికి ఉపయోగపడుతుందన్నారు. ప్రతీ ఒక్కరూ పండ్ల మొక్కలు విత్తనాలు నాటాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
శుక్రవారం | ఆగస్టు 09, 2024 | www.navatelangana.com

ఎస్టీపీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

- డైరెక్టర్‌ను కలిసిన హెచ్‌ఎంఎస్ నాయకులు

నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ కోరారు. గురువారం కొత్తగూడెంలో సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణ రావు, డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్‌ను ఎస్టీపీపీ హెచ్‌ఎంఎస్ నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఎస్టీపీపీ ప్రభావిత గ్రామాల వారికి ఎస్టీపీపీలో ఉద్యోగావకాశాలు కల్పించాలని, ఎన్‌టీపీసీలో చెల్లిస్తున్నట్లుగా కార్మికులకు అలవెన్సులు అమలు చేయాలని అన్నారు. సింగరేణి అనుబంధంగా కొనసాగుతున్న కాంట్రాక్టులు, ప్రయివేటు సెక్యూరిటీ సిబ్బందికి సంబంధించి కార్మిక హక్కులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎస్టీపీపీ కార్మికులకు సబ్సిడీ క్యాంటీన్ ఏర్పాటు చేయాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ హెచ్‌ఎంఎస్ నాయకులు జనరల్ సెక్రెటరీ విక్రమ్ కుమార్, వర్కింగ్ ప్రసిడెంట్ ప్రదీప్‌రెడ్డి, వైస్ ప్రసిడెంట్ సాయి కృష్ణారెడ్డి, చిప్పకుర్తి సంపత్, నవీన్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై న్యాయ పోరాటం చేస్తాం

నవతెలంగాణ-లక్షెట్టిపేట



సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పు సరికాదని దీనిపై న్యాయపోరాటం చేస్తామని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు దమ్మ నారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు సరైనది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర మాల మహానాడు సంఘం ఆధ్వర్యంలో హలో మాల-చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. మాల మహానాడు ఆధ్వర్యంలో వర్గీకరణను వ్యతిరేకిస్తున్నామని, ఢిల్లీలో జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. రెండు రోజులుగా కొనసాగే ఈ నిరసన కార్యక్రమం అనంతరం సుప్రీంకోర్టులో పిటిషన్ వేస్తామని తెలిపారు. దీన్ని ఎలాగైనా అడ్డుకుంటామని, వర్గీకరణతో పేద ప్రజలకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బి.మల్లేష్, పలువురు రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

13వ బెటాలియన్‌లో కరోనా కలకలం..?

- ట్రైనీ కానిస్టేబుల్స్‌కు గోప్యంగా చికిత్సలు

నవతెలంగాణ-హాజీపూర్

మండలంలోని గుడిపేట 13వ బెటాలియన్‌లో కరోనా సోకి 100 మంది ట్రైనీ కానిస్టేబుళ్ల అస్వస్థతకు గురైనట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆ బెటాలియన్‌లో శిక్షణ తీసుకుంటున్న 570 మంది టీజీ ఎస్పీ కానిస్టేబుల్‌లలో 100 మంది వరకు కరోనా సోకినట్లు తెలిసింది. ఇందులో 20 మంది వరకు క్వారెంటైన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు తెలుస్తోంది. మరో పది మందిని ఇంటికి పంపినట్లు సమాచారం. ఈ విషయమై బెటాలియన్ అధికారులు బైటికి రాకుండా జగ్రత పడుతున్నారని తెలుస్తోంది. వందల మంది ట్రైనింగ్ లో ఉండగా వారి కుటుంబ సభ్యులు రెండు రోజులుగా వస్తూ పోతుండడంతో ఈ విషయం బయటకు వచ్చింది. కొందరేమో మాములు జ్వరం అంటున్నా.. 100 మందికి ఒకే సారి జ్వరం రావడం ఏమిటని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

చిరుత దాడిలో ఆవు మృతి

నవతెలంగాణ-బోథ్

చిరుత దాడిలో ఆవు మరణించిన ఘటన మండలంలోని పార్డి(బి)లో జరిగింది. గ్రామానికి చెందిన రైతు తొడసం సీతారాంకు చెందిన ఆవు చిరుత పులి దాడిలో మృతి చెందింది. రైతు తెలిపిన వివరాల ప్రకారం చింతలబోరి శివారంలోని అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లింది. వచ్చి చూసే సరికి ఆవు మరణించి ఉందని, చిరుత పులి దాడి చేసినట్లు గుర్తించామన్నారు. ఆవు విలువ రూ.30 వేల వరకు ఉంటుందని అటవీ అధికారులు నష్టపరిహారం చెల్లించాలని రైతు కోరారు.

ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-జన్నారం



రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులతో పాటు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సబ్బండ వర్గాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేదింటి ఆడపడుచులకు కళ్యాణలక్ష్మి పథకం వరమన్నారు. సీఎంఆర్‌ఎఫ్ పథకం వల్ల పేదలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఆపరేషన్ సమయంలో రోగి చికిత్సకు అయ్యే ఖర్చును ఎల్‌ఓసీ ద్వారా తక్షణమే నిధులను మంజూరు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. 60 మంది కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ లబ్దిదారులు, 21 మంది, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ వర్ధన్‌రెడ్డి, ఎంపీడీఓ శశికళ, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ జలంధర్, కాంగ్రెస్ నాయకులు పూజాఫరా అలీ ఖాన్, మేకల మాణిక్యం, రాజశేఖర్, మోహన్‌రెడ్డి, పసియుల్లా, దాముఖ కరుణాకర్, బండారి స్వామి, రియాజుద్దీన్, ఇసాక్ సత్యనారాయణ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛదనం-పచ్చదనం

నవతెలంగాణ-మందమర్రి



మున్సిపాలిటీ పరిధిలో గురువారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. 24 వార్డులలో వార్డు ఆఫీసర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఆశాలు ఇంటింటికి తిరుగుతూ ఐఈసీ ప్రచారాన్ని నిర్వహించారు. పాఠశాలలో సమావేశాలు ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై ఆరోగ్య కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణ ప్రాంతాల్లో ఫీవర్ సర్వే నిర్వహించారు. జ్వరాలు వచ్చిన ప్రాంతాల్లో ఇంటెన్సివ్ క్లీనింగ్, యాంటీ లార్వల్, ఫాగింగ్ చేపట్టారు. నీరు నిలిచిన గుంతలలో ఆయిల్ బాల్స్ విడుదల చేసి దోమల వృద్ధిని నిరోధించారు. కొన్ని వార్డులలో లార్వా నిరోధక రసాయనాలు పిచికారి చేపించారు. మానవులపై దాడి చేసే అవకాశం ఉన్న దూకుడు కుక్కలు, క్రూరమైన కుక్కలు, వీధి కుక్కలను గుర్తించారు. వీధి కుక్కలు కరవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ గోడ ప్రతులను, ఫ్లెక్సీలను వివిధ వార్డులలో ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం సుమతి, ఇన్‌చార్జి మేనేజర్ పి కృష్ణ ప్రసాద్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వి శ్యాంసుందర్, సీనియర్ అసిస్టెంట్లు బి శ్రీనివాస్, ఏ రాణి, జి రాజేందర్, డి లక్ష్మి రాజు, హెల్త్ అసిస్టెంట్ ఎంఏ సమీర్, జూనియర్ అసిస్టెంట్లు ఎస్ రాజ్ కుమార్, బి విమల రాణి, షేక్ జహీర్, ఇ వసంత్, పున్నం చందర్ పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలోని కొండాపూర్, కొనూర్, లంబాడితండా(డీ), ధర్మరావుపేట, తాటిగూడ గ్రామ పంచాయితీల్లో గురువారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి మాదావి గంగారాం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో సమావేశం నిర్వహించి డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు వ్యాధులు రాకుండా విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో గ్రామ పంచాయతీలో జ్వరాలు ఉన్నవారి వివరాలు సర్వేలో నిర్వహించారు. వర్షపు నీరు ఎక్కువ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేశారు. బైలార్వా స్ప్రే చేశారు. వీధి కుక్కలు ఎక్కువగా ఉన్న చోట వాటిపై సర్వే నిర్వహించాలని సూచించారు. మురికి కాలువలు పూడికతీత, అమ్మ ఆదర్శ పాఠశాల పనులను, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సహాయకులు లక్ష్మీ నారాయణ, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు రజిత, దీప్తి, రాము, అన్నపూర్ణ, మౌనిక పాల్గొన్నారు.

ముంపు భూములకు నష్టపరిహారం చెల్లించాలి

నవతెలంగాణ-జైపూర్

అన్నారం శివారులో గోదావరి నదిపై నిర్మించిన బ్యారేజ్ బ్యాక్ వాటర్ ముంపుకు గురవుతున్న భూములకు సంబంధించిన నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతులు అభ్యర్థిస్తున్నారు. ఈ సందర్భంగా చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని స్థానిక కాంగ్రెస్ నాయకులు చల్ల సత్యనారాయణరెడ్డి, విశ్వంబర్‌రెడ్డిలతో కలిసి వినతి పత్రం అందజేశారు. శివ్వారం శివారులో గల 33 ఎకరాలు 22 గుంటలు అన్నారం బ్యారేజ్ బ్యాక్ వాటర్‌లో మునిగిపోతున్నట్లు అధికారులు గుర్తించి గతంలోనే ప్రభుత్వానికి నివేధిక అందజేశారని తెలిపారు. ఈ క్రమంలో ఎకరాకు రూ.9 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించేందుకు అంగీకరించిన గత ప్రభుత్వం రూ.2 కోట్ల 80 లక్షలు మంజూరు చేసిందని వివరించారు. ఆ నిధులను పక్కదారి పట్టించడంతో పరిహారం కోసం నిరీక్షించక తప్పడం లేదన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత శాఖ మంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అభివృద్ధి పనుల ప్రణాళికలు సిద్ధం చేయండి

- ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

నవతెలంగాణ-జైపూర్



మండల పరిధిలో గ్రామీణుల సౌకర్యార్థం చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. ఇందారం, టేకుమట్ల, రామారావుపేట్ గ్రామ పంచాయతీలలో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి గురువారం పర్యటించిన ఆయన గ్రామీణుల సమస్యలు అడిగి తెల్సుకున్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అదేవిధంగా గ్రామ పంచాయతీలో చేపడుతున్న పారిశుధ్య పనులు పరిశీలించారు. గ్రామ పంచాయతీల్లో పర్యటించిన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పుష్ప గుచ్చాలతో స్వాగతం పలికి శాలువాలతో ఎమ్మెల్యేను సన్మానించారు. జిల్లా పరిషత్ సీఈఓ గణపతి, స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ గౌడ్, ఎంపీఓ శ్రీపతి బాపు రావు, మిషన్ భగీరథ ఏఈ విద్యాసాగర్, పంచాయతీ రాజ్ ఏఈ రాజ్ కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫయాజోద్దీన్, జిల్లా కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, తాజామాజీ సర్పంచులు గడ్డం మంజుల ప్రసాద్, నామాల సత్యవతి తిరుపతి పాల్గొన్నారు..

దోబీ ఘాట్ ఏర్పాటు చేయాలని వినతి

రామారావుపేట్ గ్రామ పంచాయతీకి సంబంధించి దోబీ ఘాట్ ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన రజక కుల సంఘం నాయకులు కోరారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే వివేక్‌ను కలిసి దోబీ ఘాట్ ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. ఇందారం-రామారావుపేట్ మధ్యన గల పెద్ద చెరువులో బట్టలు ఉతికే పరిస్థితి లేదని తెలిపారు. సింగరేణి ఏరియా నుంచి చెరువులోకి వచ్చి చేరుతున్న మురికి నీటిలో బట్టలు ఉతుకరాదని గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని ఫలితంగా మా ఉపాధికి భంగం కలుగుతుందని తెలిపారు. దోబీ ఘాట్ ఏర్పాటు చేస్తే తప్పా తమకు ఉపాధి దొరకదని రజకుల సంఘం నాయకులు తుంగపిండి వెంకటేశ్, తిరుపతి, సంతోష్, సత్తయ్య కోరారు.

బకాయిలు చెల్లించి సీఎంపీఫ్ చిట్టీలు అందజేయాలి



నవతెలంగాణ-నస్పూర్

రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ.27 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని, అలాగే కార్మికులకు సీఎంపీఎఫ్ చిట్టీలు అందజేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు, శాశ్వత వేజ్ బోర్డు సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆర్కే-5 గని ఆవరణలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం లాగే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సింగరేణి సొమ్మును దుర్వినియోగం చేస్తుందన్నారు. సింగరేణి యాజమాన్యం సంస్థ సొమ్మును రాష్ట్ర ప్రభుత్వాలకు మళ్లించకుండా కార్మికుల సంక్షేమం కోసం ఉపయోగించాలన్నారు. సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులందరికీ రెండు గుంటల భూమి, రూ.20 లక్షల వడ్డీ లేని రుణాన్ని ఇప్పించాలన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యాల వల్ల సింగరేణి సంస్థ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని కాబట్టి నూతన బొగ్గు బావులను ఏర్పాటు చేయాలన్నారు. ఒకే కుటుంబం ఒకే లక్ష్యం ఒకే గమ్యం అని చెప్పే సింగరేణి యాజమాన్యం పెరిక్స్ పై ఆదాయ పన్నును అధికారులకు యాజమాన్యమే చెల్లిస్తుందని కానీ కార్మికులకు ఎందుకు చెల్లించడం లేదని వారికి ఈ సందర్భంగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా, ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, ఫిట్ కార్యదర్శులు గునిగంటి నరసింగరావు, రామచందర్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ట్రేడ్మేన్స్ నాయకులు సురేష్, యాదగిరి సత్యనారాయణరెడ్డి, సహాయ కార్యదర్శి లక్కిరెడ్డి, సత్తిరెడ్డి, జీపీ రావు, దేవేందర్ పాల్గొన్నారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వాల్ పోస్టర్లు విడుదల

నవతెలంగాణ-జన్నారం

ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మంచిర్యాల జిల్లాలోని ఆర్యవైశ్య భవన్‌లో నిర్వహించే ఆదివాసీ సభను విజయవంతం చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కురిసెంగ వెంకటేష్, మండల అధ్యక్షుడు రాయి సీండం కాశీ పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రాజ వర్ధన్ చేతుల మీదుగా చలో మంచిర్యాల ప్రపంచ ఆదివాసీ దినోత్సవ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభకు ఆదివాసీల అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు కే తిరుపతి, ధర్మ పటేల్, సోనీ పటేల్, గంగు పటేల్ పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : పట్టణంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కరపత్రాలను జీసీసీ చైర్మన్ కోట్నాక తిరుపతి చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసులకు ఎంతో ప్రాముఖ్యత ఇస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహన కమిటీ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, మండల అధ్యక్షుడు మడావిశంకర్, తుడుందెబ్బ ఉపాధ్యక్షుడు కుడిమెత తిరుపతి, సలహాదారు సోయం జంగు, కొమ్ముల బాపు, బాబు, కోవ జంగు, బద్ది శ్రీనివాస్, తోటి సేవా సంఘం లక్షెటిపేట నాయకులు శంకరయ్య, ఆత్రం రాజయ్య పాల్గొన్నారు.



జన్నారం



లక్షెట్టిపేట

ధ్వంసమైన మున్సిపల్ వాహనం

నవతెలంగాణ-మంచిర్యాల



మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో బయో టాయిలెట్స్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనం ధ్వంసం అయింది. బుధవారం పిప్రిలో జరిగిన ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సభకు వెళ్లి వచ్చే క్రమంలో వాహనానికి ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. మంచిర్యాల మున్సిపాలిటీలోని బయో టాయిలెట్‌ల కోసం ఉపయోగించే ఈ వాహనానికి ఉన్నదీ ఒక్కరే డ్రైవర్, అతను కూడా బుధవారం లీవ్ మీద హైద్రబాద్‌లోని హాస్పిటల్‌కి వెళ్ళాడు. అదే సమయంలో అర్హత లేని డ్రైవర్ సభకు వాహనాన్ని తీసుకెళ్లడంతో వాహనం ధ్వసం అయినట్లు తెలిసింది. జరిగిన విషయంపై మున్సిపల్ సానిటరీ ఇన్స్‌పెక్టర్ ఉదయ్‌ని వివరణ కోరగా అట్టి వాహనానికి నియమించిన డ్రైవర్ శ్రీనివాస్ ఆ వాహనాన్ని తీసుకెళ్లినట్లు తెలిపాడు. ఒక వైపు బయో టాయిలెట్ వాహనాన్ని నిత్యం నడిపే డ్రైవర్ శ్రీనివాస్ లీవ్‌లో ఉండగా అదే డ్రైవర్ అట్టి వాహనాన్ని సభకు తీసుకెళ్లినట్లు సదరు అధికారి తెలపడం పలు అనుమానాలకు దాతిస్తోంది. ధ్వంసం అయిన వాహనానికి బాధ్యులెవరనేది తెలియవల్సి ఉంది.కాగా మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్‌ని వివరణ కోరగా బయో టాయిలెట్ వాహనానికి ఇద్దరు డ్రైవర్లు ఉన్నారని ఈ విషయంపై విచారణ చేపడతామని తెలిపారు.

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం.. అధికారుల చోద్యం

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణి ఉపరితల గనిలో పనిచేసే కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో కాంట్రాక్టు కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో ఉపరితల గనిలో పనులను నిలిపి వేయాల్సి ఉండగా కాంట్రాక్టర్లు వాహనాలను నడిపించడంతో ప్రమాదాలకు గురవుతున్నాయి. వాహనాలు బోల్తా పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల వర్షాల కారణంగా ఉపరితల గని ఓబీ కాంట్రాక్టు కంపెనీకి సంబందించిన రెండు వోల్వో వాహనాలు బోల్తా పడ్డాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాంట్రాక్టర్ల పైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మైనింగ్ స్టాఫ్ ఏఐటీయూసీ సబ్ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-మందమర్రి

కేకే-5 గని మైనింగ్ స్టాఫ్ ఏఐటీయూసీ సబ్ కమిటీని గురువారం ఎన్నుకున్నారు. మైనింగ్ స్టాఫ్ ఏఐటీయూసీ ఇన్‌చార్జి వంగరి రాజేశ్వర్ రావు, గోపతి సత్యనారాయణ, దేవసాని సాంబయ్య, పిట్ సెక్రెటరీ సంపత్ ఆధ్వర్యంలో మైనింగ్ స్టాఫ్ ఏఐటీయూసీ సబ్ కమిటీని ఎన్నుకున్నారు. పిట్ సెక్రటరీ నాగేశ్వర్ నాయక్, అసిస్టెంట్ పిట్ రాజేశం, వైస్ ప్రెసిడెంట్ విక్రమ్ సింగ్, షిఫ్ట్ వైస్ సాయి కృష్ణ, ఆశిష్ జూపాక, రెడ్డి రాజుల అజయ్, కె ప్రశాంత్, కె శ్రీకాంత్ సలహాదారులు దేవాసాని సాంబయ్య, శివ కృష్ణ, సమ్మయ్యలను ఎన్నికయ్యారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దూరం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధులు ప్రబలవని అదనపు కలెక్టర్ శ్యామల దేవి అన్నారు. గురువారం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా నాల్గవ రోజు ఖానాపూర్ యూపీఎస్ ఉర్దూ మీడియం, ఉన్నత పాఠశాల తెలుగులో వైద్య శిబిరం నిర్వహించారు. పుత్లీబౌలి అర్బన్ పీహెచ్‌సీ వైద్యురాలు ఆఫ్షియ ఫాతిమ విద్యార్థులకు ఆరోగ్య సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతో పాటు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, సీ విటమిన్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామల దేవి మాట్లాడుతూ స్వచ్ఛదనం పచ్చదనంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇది వారం రోజుల కార్యక్రమం కాకుండా నిత్యం చేయాలని సూచించారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడంతో పాటు ఇతరులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, మైనింగ్ ఏడీ, వార్డు స్పెషల్ ఆఫీసర్ రవి వంకర్, హెచ్‌ఎంలు వకీల్, సంతోష్, పుత్లీబౌలి అర్బన్ పీహెచ్సీ సీఓ నవీన్, ఏఎన్‌ఎం అర్ణపూర్ణ, ఆశాలు శారద, సుజాత పాల్గొన్నారు.

గంబూషియ చేపల విడుదల...

వర్షకాలం సీజన్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ సూచించారు. గురువారం స్వచ్ఛదనం పచ్చదనంలో భాగంగా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో నిల్వ నీటిలో మత్స్యశాఖ సహకారంతో గంబూషియ చేపలను వదిలారు. ఖానాపూర్ శివారులోని ఖాళీ స్థలంలో పెద్దఎత్తున నీరు నిల్వ ఉన్న చోట ఈ చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ నిల్వ నీటిలో దోమలు గుడ్లు పెట్టడంతో వృద్ధి చెందుతాయన్నారు. లార్వ దశలో ఉన్న వాటిని గంబూషియ చేపలు తింటాయని, దాని వల్ల దోమలు పెరగవన్నారు. అదేవిధంగా ప్రజలు ఇండ్లలోని కుండిలు, కూలర్లు, పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా మలేరియ అధికారి శ్రీధర్, జిల్లా ఇమ్మ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

అవగాహన ర్యాలీ..

స్వచ్ఛదనం పచ్చదనంలో భాగంగా పట్టణంలోని వార్డు నంబర్ 49 భుక్తాపూర్‌లోని ఆశ్రమ బాలిక పాఠశాలలో అవగాహన ర్యాలీని చేపట్టారు. దీనికి అదనపు కలెక్టర్ శ్యామల దేవి ముఖ్య అతితిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ పట్టణంలోని పలు విధుల గుండా సాగింది. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ వెనగంటి ప్రకాష్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, గిరిజన క్రీడాలాభివృద్ధి అధికారి పార్థసారధి, వార్డు ఆఫీసర్ పాషా పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-జన్నారం

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ఏపీఎం బుచ్చన్న అన్నారు. గురువారం స్వచ్ఛదనం-పచ్చదనం నాలుగవ రోజు కార్యక్రమంలో భాగంగా కలమడుగులో ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. మంచినీటి బావులను పరిశీలించి క్లోరినేషన్ చేశారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురికి నీరు నిలవకుండా చూసుకోవాలన్నారు. డెంగు మలేరియా పేదల నుంచి కాపాడుకోవాలన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా తపాలపురం గ్రామంలో నాలుగో రోజు వైద్య ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి డ్రైడే నిర్వహించి సీజనల్ వ్యాధుల పట్ల వారికి అవగాహన కల్పించి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య విద్య, పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల పట్ల వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ అబ్రహం, హెల్త్ అసిస్టెంట్ కొల్లూరి కమలాకర్, మాధవి పంచాయతీ సెక్రెటరీ రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు దుంపల తిరుపతి, తుంగూరు గోపాల్, ధార శ్రీనివాస్, రాజేందర్. ఆశా లలిత, అంగన్‌వాడీ టీచర్ కవిత పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



సమావేశంలో అధికారులకు సూచనలు చేస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహించనున్నందున వేదిక, సీటింగ్ ఏర్పాట్లు పక్కాగా చేయాలని, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా వేడుకలు సజావుగా జరిగేలా శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణాభివృద్ధి, ఫారెస్ట్, విద్య, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం తదితర శాఖల శకటాల ప్రదర్శనతో పాటు స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. గృహజ్యోతి, మహాలక్ష్మి, రూ.500కు గ్యాస్ కనెక్షన్, రైతు రుణ మాఫీ, రైతు భరోసా, వన మహోత్సవం తదితర పథకాలపై శకటాలు, స్టాల్స్ ఉండాలన్నారు. ప్రొటోకాల్‌ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, ప్రత్యేక అధికారులు ఉదయం తమతమ మండలాలు, గ్రామాలలో జెండా ఆవిష్కరణ జరిపి, జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకలకు హాజరు కావాలని తెలిపారు. ప్రత్యేక అధికారులు అందుబాటులో లేని పక్షంలో మండల కేంద్రాలలో ఎంపీడీఓలు, గ్రామ పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు జెండావిష్కరణ చేయవచ్చని సూచించారు. సమర్థవంతంగా విధులు నిర్వహించిన వారికి ఉత్తమ ఉద్యోగుల ఎంపిక కోసం శాఖల వారీగా నిర్ణీత గడువులోపు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా స్వచ్ఛదనం-పచ్చదనం



నవతెలంగాణ-నార్నూర్

ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం గ్రామాల్లో ముమ్మరంగా కొన్నసాగుతోంది. గురువారం మండల కేంద్రంలో ఎంపీడీఓ జవహర్‌లాల్, ఎంపీఓ స్వప్నశీల బ్లేడ్ ట్రాక్టర్ ద్వారా రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను, చెత్తాచెదారం తొలగించారు. గ్రామాల్లో చెత్త, పిచ్చి మొక్కలు లేకుండా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని తెలిపారు. సుంగాపూర్-చింతగూడ గ్రామానికి వెళ్లే కల్వర్టుపై కార్యదర్శి విజయ్ కుమార్, మాజీ సర్పంచ్ జీజాబాయి మొరం వేసి మరమ్మతు పనులు చేయించారు. భీంపూర్ గ్రామపంచాయితీలో రోడ్డుకు ఇరువైపులా టీపీ చౌహాన్ వికాస్ కూలీలతో కలిసి మొక్కలు నాటించారు.

బాలికల ఆశ్రమ పాఠశాలలో ఫ్రెషర్స్ డే



నవతెలంగాణ-ఖానాపూర్

పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో గురువారం జరిగిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని అన్నారు. విద్య బోధన చేస్తున్న గురువులను గౌరవించాలని, మంచి మార్గంలో నడవాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం, వైస్ చైర్మన్ కావలి సంతోష్, నాయకులు పరిమి సురేష్, అమనుల్లాఖాన్, షబ్బీర్ పాషా, మున్సిపల్ కమిషనర్ మనోహర్, మండల అధ్యక్షులు దోనికేని దయానంద్, పిఎసిఎస్ చైర్మన్లు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, అమంద శ్రీను, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని పది గ్రామాల గర్భిణులకు గురువారం డాక్టర్ రాంబాబు వైద్య పరీక్షలు నిర్వహించారు. నాగల్‌కొండ, దేవారిగూడ, మరపగూడ, దేవుపటార్, బలన్‌పూర్ ఇలియాస్‌నగర్, భవానీగూడ, సోనాపూర్, బేతలగూడ గ్రామాలను కలిపి మొత్తం 25 మందిని పరీక్షించి ఉచిత మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో సిహెచ్‌ఓ లక్ష్మి, సవితాంజలి, పిహెచ్‌ఎన్‌ఓ, సుశీల, సత్తవ్వ, హెల్త్ సూపర్వైజర్ చౌహన్ చరణ్‌దాస్, ఫార్మాసిస్ట్, పవార్ వీలాష్, విజయకుమారి, సరిత, సారిక, వర్ష ప్రియాంక, విమల, పలువురు ఆశాలు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలపై ట్రైనీ కలెక్టర్ సమీక్ష



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వైద్య శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై శిక్షణ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవ్య సమీక్షించారు. గురువారం పట్టణంలోని డిఎంహెచ్‌ఓ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఓ రాథోడ్ నరేందర్ శాఖ ద్వారా చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాలను ట్రైనీ కలెక్టర్‌కు వివరించారు. ప్రజారోగ్యం మరింత మెరుగుపరిచేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో వారితో చర్చించి సూచనలు చేశారు. కార్యక్రమంలో డిఐఓవైసి శ్రీనివాస్, డిఎంఓ శ్రీధర్ పాల్గొన్నారు.

బస్సును అడ్డుకున్న ఏబీవీపీ నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏబీవీపీ ఆధ్వర్యంలో నలంద కళాశాల బస్సును కలెక్టరేట్ చౌరస్తాలో అడ్డుకున్నారు. బస్సులో ఎక్కువ మంది విద్యార్థులను నిబంధనలకు విరుద్ధంగా తీసుకెళ్తున్నారంటూ బుధవారం రోడ్డుపై అడ్డుకున్నారు. అక్కడ బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్ మాట్లాడుతూ ఒక మినీ బస్సులో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ ప్రమాదకరంగా అధిక సంఖ్యలో విద్యార్థులను తీసుకెళు న్నారని అన్నారు. ఆర్టీఓ అధికారులు బస్సు ఫిటెనెస్ పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

మానవ మనగడకు చెట్లే ఆధారం

- ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-సారంగాపూర్

మానవ మనగడకు చెట్లే ఆధారమని ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గండి రామన్న హరితవనంలో 75వ వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి మాట్లాడారు. నేటి మొక్కలే రేపటి మహావృక్షాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని సూచించారు. చెట్టు నీడతో పాటు ఫలాలను ఇస్తుందన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యత మొక్కలు నాటి వాటిని సరంక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీఎఫ్ శరవనన్, ఎఫ్డీఓ షేక్ నాగిని బాను, ట్రైనీ ఐఎఫ్ఎస్ ప్రసాద్‌రెడ్డి, ఎఫ్ఆర్ఓ రామకృష్ణ, డిప్యూటీ ఎఫ్ఆర్ఓలు నజీర్‌ఖాన్, సంతోష్, ఎఫ్ఎస్ఓ వేణుగోపాల్, మండల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



స్కిల్ డెవలప్మెంట్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీసీ విద్యావంతులైన నిరుద్యోగ యువతకు సెప్టెంబర్ 1 నుంచి నవంబర్ 30 వరకు 90 రోజులపాటు నాన్ రెసిడెన్షియల్ ఫ్రీ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను ఎల్‌జి హోప్ టెక్నికల్ స్కిల్ అకాడమీ, కుషాయిగూడ, హైదరాబాద్ ద్వారా 100 మంది అభ్యర్థులకు హైదరాబాద్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి కె.రాజలింగు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి. ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమం పూర్తయిన తరువాత ఎల్‌జి హోప్ టెక్నికల్ స్కిల్ అకాడమీ ద్వారా ప్లేస్మెంట్లు కూడా అందించబడతాయని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఒక్కో అభ్యర్థికి నెలకు రూ.4000 చొప్పున 3నెలల పాటు స్టైపెండ్‌ను ఈ సంస్థ మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసున్న ఎస్ఎస్‌సి/ఇంటర్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. ఆగస్టు 9 నుండి 24వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5లక్షల లోపు ఉండాలని, ఎస్ఎస్‌సి మార్కుల మెరిట్ ఆధారంగా ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 08732221280 నెంబరులో సంప్రదించాలని సూచించారు.